**జర్నలిస్టులు కావలెను**

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.



APTEL /25/A2478

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

గుంటూరు

సంపుటి : 02 సంచిక : 237 బుధవారం 06- 05 - 2026 పేజీలు : 4 వెల. 2/-



**రిపోర్టర్లు కావలెను**

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


### ఏపీ ప్రజల చిరకాల స్వప్నం

# నెరవేరింది



**అమరావతి, మే 05 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్‌ను విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని తెలిపారు. మంగళవారం విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వ గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సీఎం

2లో

### తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్

# 7న ప్రమాణ స్వీకారం

**చెన్నై: మే 05 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన తమిళగ వెట్రి కళగం (ఎఖ) పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహకాలు చేస్తోంది. పార్టీ అధినేత విజయ్ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక కావడంతో ఈనెల 7న కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణస్వీకర కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నాయి.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అనూహ్యంగా 108 స్థానాల్లో విజయం సాధించినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118 సీట్లను దక్కించుకోలేకపోయింది. మెజారిటీకి మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంది. టీవీకే సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతిచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సుముఖంగా ఉందని వినిపిస్తోంది. వామపక్ష పార్టీలు సైతం టీవీకే నేతలతో సంప్రదింపులు సాగించనున్నట్టు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్-5, వీసీకే-2, సీపీఐ-2, సీపీఎం-2 సీట్లు గెలుచుకున్నాయి. ఐయూఎంఎల్, డీఎండీకే, పీఎంకే పార్టీలను నుంచి కూడా టీవీకేకు మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

**గవర్నర్‌కు లేఖ**

కాగా, ప్రభుత్వం ఏర్పాటుకు తమను ఆహ్వానించాల్సిందిగా గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌కు విజయ్ మంగళవారంనాడు లేఖ రాసినట్టు తెలుస్తోంది. మెజారిటీ నిరూపించుకునేందుకు రెండు వారాలు గడువివ్వాలని ఆ లేఖలో కోరినట్టు సమాచారం. మరోవైపు, ఓటమి నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. గవర్నర్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని సమర్పించారు. దానిని



గవర్నర్ వెంటనే ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేంత వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని స్టాలిన్‌ను గవర్నర్ కోరారు.

---

### తమిళనాడు సీఎం ఎం.కే. స్టాలిన్ రాజీనామా..

# గవర్నర్ ఆమోదం



**చెన్నై (తమిళనాడు), మే 05 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ద్రవిడ మున్నేట్ర కజగం పరాజయం పాలైన నేపథ్యంలో.. ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ రోజు (మంగళవారం) మధ్యాహ్నం ఆయన లోక్‌భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. స్టాలిన్ రాజీనామాను గవర్నర్ వెంటనే ఆమోదించారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ ఆయన్ని కోరారు.

తాజాగా జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. 234 అసెంబ్లీ స్థానాలకు గాను.. 108 స్థానాలను కైవసం చేసుకోగా.. అధికారంలో ఉన్న కేవలం 59 స్థానాలకే పరిమితమైంది. ఒక భారీ కుదుపుగా, ముఖ్యమంత్రి స్టాలిన్ తన సొంత నియోజకవర్గమైన

2లో



### అమరావతి రైతుల

## సమస్యలపై ఫోకస్

**అమరావతి, మే 05 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసం సీఆర్డీఏ కార్యాలయంలో త్రీమెన్ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అనివార్య కారణాలు, అసెంబ్లీ సమావేశాల కారణంగా త్రీమెన్ కమిటీ సమావేశం కొంత ఆలస్యం అయ్యిందని తెలిపారు. కొత్తగా సీఆర్‌డీఏ కమిషనర్‌గా విజయరామరాజు బాధ్యతలు స్వీకరించారన్నారు. నేడు జరిగిన సమావేశంలో రాజధాని గ్రామాల సమస్యలపై కీలకంగా చర్చించామని, ఎన్‌ఎస్పీ ప్రభావిత బాధితుల

2లో

### కేంద్ర ఎన్నికల సంఘమే

# ప్రధాన విలన్

## మమతా బెనర్జీ

**కోల్‌కతా: మే 05 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారంనాడు మమతా



బెనర్జీ మాట్లాడారు.

ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహారం

2లో

---

# తమిళనాడు అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని ప్రధాని మోదీని కోరిన విజయ్



**చెన్నై (తమిళనాడు), మే 05 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి ప్రభంజనం సృష్టించిన తమిళగ వెట్రి కళగం అధినేత, సినీ నటుడు విజయ్‌కు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో నిన్న ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసిన సంగతి తెలిసిందే.తన రాజకీయ ప్రస్థానంలో తొలి అడుగు లోనే భారీ విజయాన్ని అందుకున్న

2లో

# పెట్టుబడుల హబ్‌గా ఏపీ..

### మంత్రి నారా లోకేశ్ కృషితో మరో భారీ పరిశ్రమ



**అమరావతి, మే 05 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పెట్టుబడిదారులకు ఆకర్షణీయ కేంద్రంగా మారుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కృషితో రాష్ట్రానికి పరిశ్రమలు వరుసగా వస్తున్నాయి. గత 22 నెలల కాలంలో సుమారు 800 ప్రాజెక్టులు రాష్ట్రంలోకి

2లో


గుంటూరు, ప్రకాశం, విజయవాడ, కాకినాడ, అనంతపూర్, కడప ఎడిషన్లతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా వెలువడుతున్న క్రైం కౌంటర్ దినపత్రికలో వ్యాపార ప్రకటనలకు సంప్రదించండి. 9849707349

# ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది: సీఎం చంద్రబాబు

చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్‌ను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. 2026, జూన్ 1వ తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస – ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ద్వారా ఉత్తరాంధ్ర రవాణా రంగం ముఖచిత్రాన్ని మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటైన విశాఖపట్నం డివిజన్, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఏపీ సీఎం ఆకాంక్షించారు. రాష్ట్రాభివృద్ధికి.. ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ రైల్వే జోన్ ఏర్పాటు దోహద పడుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

# కేంద్ర ఎన్నికల సంఘమే ప్రధాన విలన్.. మమతా బెనర్జీ

చారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీ చేశారు' అని మమత ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పోలింగ్ ముగిసిన తర్వాత కూడా 80 నుంచి 90 శాతం కంటే ఎక్కువ బ్యాటరీని కలిగి ఉండటం ఏమిటి? అని ప్రశ్నించారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందే అధికారులు తమ పార్టీపై దాడులు, కార్యకర్తల అరెస్టులు చేశారని అన్నారు.

భవనీపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని అన్నారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు.

'ఇండి' కూటమిలోనే..

ఈ మొత్తం ఉదంతంలో 'ఇండి' కూటమి తన వైపే ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తనతో మాట్లాడారని, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ తదితరులు ఫోను చేసి సపోర్ట్‌గా నిలిచారని చెప్పారు. 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు.

# తమిళనాడు సీఎం ఎం.కే. స్టాలిన్ రాజీనామా.. గవర్నర్ ఆమోదం

కొలత్తూరులో అభ్యర్థి వి.ఎస్. బాబు చేతిలో 8,795 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.రాజీనామా అనంతరం స్టాలిన్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. 'ప్రజల తీర్పును శిరసావహిస్తున్నాను. గత ఐదేళ్లలో డీఎంకే ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసింది. మా కూటమికి మద్దతు తెలిపిన కోట్లాది మంది ఓటర్లకు కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలతో స్టాలిన్ బుధవారం సమావేశం కానున్నారు.తమిళనాడు రాజకీయాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న డీఎంకే-ఏఐఏడీఎంకే ద్వంద్వ ఆధిపత్యానికి ఈ ఎన్నికల ఫలితాలు తెరదించాయి. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి పది సీట్లు అవసరం కావడంతో ఇతర చిన్న పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది.

# ప్రజా సంక్షేమ విషయాలపై అమరావతి రాష్ట్ర సచివాలయం సిసిఎల్ఏ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అధికారులు

**ది 05 మే 2026. (బాపట్ల బ్యూరో రెడ్డి వర ప్రసాద్)** మంగళవారం ఉదయం అమరావతి, రాష్ట్ర సచివాలయం సిసిఎల్ఏ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సి సి యల్ ఏ స్పెషల్ సెక్రెటరీ జయలక్ష్మి, అన్ని జిల్లా కలెక్టర్లు, జెసి లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రౌండింగ్ తృథింగ్, విల్లేజ్ సర్వేయర్ లాగిన్, వి ఆర్ ఓ లాగిన్, తహశీల్దార్ లాగిన్, జె సి లాగిన్, వెబ్ ల్యాండ్, పట్టాదార్ పాస్ బుక్స్, ఈ కె వై సి వంటి అంశాల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశము నిర్వహించారు. బాపట్ల జిల్లా నుంచి కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, డి ఆర్ ఓ.జి.గంగాధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# అమరావతి రైతుల సమస్యలపై ఫోకస్

ఇళ్ల సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. ఎఫ్ఎస్ఐ అంశాలపై కూడా సుదీర్ఘంగా మాట్లాడామన్నారు.రాజధాని ప్రాంతంలో గ్రామీణ రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని తెలిపారు. మంత్రి నారాయణ, కమిషనర్‌లు, జాయింట్ కమిషనర్లు కూడా ఫీల్డ్ విజిట్‌లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరో 2–3 వారాల్లో రెగ్యులర్ మీటింగ్‌లు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అంశాల వారీగా సమీక్ష చేయడంతో పాటు, పరిష్కారాలపై ఎప్పటికప్పుడు అప్డేట్లు ఇవ్వాలని అధికారులకు సూచించామని పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.రాజధాని అమరావతిలో రైతుల సమస్యలపై త్రీమెన్ కమిటీ, అధికారులు కలిసి చర్చించామని మంత్రి నారాయణ తెలిపారు. రోడ్లు, డ్రైన్‌లు, వాటర్, పార్కులు వంటి వాటిపై చర్చించామన్నారు. సీఆర్‌డీఏ కమిషనర్ కొత్తగా వచ్చారని.. ఆయన కూడా అన్ని గ్రామాలకు వెళ్లి, వారితో మాట్లాడితే క్లారిటీ వస్తుందని భావిస్తున్నారని తెలిపారు. గ్రామ గ్రామానికీ వెళ్తే ప్రజలు ఎక్కువగా వస్తారని.. సమస్యలు చెబుతారన్నారు. అప్పుడు అధికార యంత్రాంగానికి కూడా సమస్యలపై క్లారిటీ వస్తుందని మంత్రి నారాయణ వెల్లడించారు.

పాలసీ ప్రకారమే అన్నీ అమలవుతాయని, ఎవరికీ మినహాయింపులు ఉండవని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఆర్ ఫైవ్ జోన్‌ను వెనక్కి తీసుకున్నామని అన్నారు. అన్ని జోన్లలోనూ పనులు వేగంగా జరుగుతున్నాయని.. ఎక్కడా ఆలస్యం అనే మాటే లేదని మంత్రి తెలిపారు. హైటెన్షన్ వైర్ల రీ రూటింగ్.. శాఖమూరు పార్కు వరకు జరుగుతోందన్నారు. అక్కడి నుంచి ఎక్స్‌టెన్షన్.. రెండో దశ ల్యాండ్ పూలింగ్ తరువాత జరుగుతుందని చెప్పారు. రైతులకు కౌలు పెంపు విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై చర్చించామన్నారు. రెండో దశలో కూడా ల్యాండ్ పూలింగ్‌కు రైతులు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ నెలాఖరకు 60% భూ సమీకరణ పూర్తయ్యే అవకాశం ఉందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# తమిళనాడు అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని ప్రధాని మోదీని కోరిన విజయ్


విజయ్, తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీకి, రాహుల్ గాంధీకి సామాజిక మాధ్యమాల వేదికగా ధన్యవాదాలు తెలిపారు. రాజకీయ వైరుధ్యాలు ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్య స్ఫూర్తితో వారు స్పందించిన తీరు పట్ల విజయ్ సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర పురోగతి, ప్రజల సంక్షేమం కోసమే మా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుంది' అని ఆయన స్పష్టం చేశారు. కేవలం అధికారం కోసం కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. తమిళనాడు అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రధాని మోదీతో విజయ్ ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్ర పురోగతికి, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. సమాఖ్య స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేసినప్పుడే ఆశించిన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి దశాబ్దాల చరిత్ర ఉన్న పార్టీలను కాదని, తమిళ ప్రజలు విజయ్‌కు పట్టం కట్టడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా యువత, మహిళా ఓటర్లు వైపు మొగ్గు చూపడం ఈ భారీ విజయానికి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలోనే విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి.

# విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్





**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు అచ్చంపేట న్యూస్ :** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ . అచ్చంపేట మండలంలో 550 పైన మార్కులు సాధించిన 14 మంది విద్యార్థులను శాలువాతో సత్కరించి మెమెంటోను అందించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే.పల్నాడు జిల్లాలోనే మొదటిస్థానంలో నిలిచిన సాయినాయక్ ను ప్రత్యేకంగా సన్మానించిన ఎమ్మెల్యే.తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల తోడ్పాటుతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడం అభినందనీయమన్న ఎమ్మెల్యే.ఉన్నతమైన లక్ష్యాలను నియమించుకుని ఆ లక్ష్య సాధనకు కృషి చేయాలన్న ఎమ్మెల్యే.

# పెట్టుబడుల హబ్‌గా ఏపీ.. మంత్రి నారా లోకేశ్ కృషితో మరో భారీ పరిశ్రమ

వచ్చినట్లు ఏపీ ప్రభుత్వం వెల్లడించింది. ఈ నేపథ్యంలో మరో అంతర్జాతీయ స్థాయి సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది.శ్రీ సిటీలో క్యారియర్ సంస్థ భారీ పెట్టుబడి..

అమెరికాకు చెందిన ప్రముఖ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో తన కొత్త తయారీ యూనిట్‌ను ప్రారంభించనుంది. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ పారిశ్రామిక వాడలో ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుంది. ఈ పరిశ్రమకు శంకుస్థాపన కార్యక్రమాన్ని మంత్రి నారా లోకేశ్ రేపు(బుధవారం) నిర్వహించనున్నారు.

రూ.1000 కోట్ల పెట్టుబడి.. 3000 ఉద్యోగాలు..

ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ పారిశ్రామికవాడలో 39 ఎకరాల విస్తీర్ణంలో క్యారియర్ సంస్థ తన నూతన తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. 2028 నాటికి మూడు దశల్లో సుమారు రూ.1000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకానున్న ఈ ప్లాంట్ ద్వారా దాదాపు 3వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అలాగే ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి.

అత్యాధునిక తయారీ యూనిట్

క్యారియర్ సంస్థ ఈ ప్లాంట్‌ను అత్యాధునిక సాంకేతికతతో రూపొందించనుంది. ముఖ్యంగా ఉత్పత్తుల తయారీపై దృష్టి పెట్టనుంది. ఈ ప్లాంట్ హెచ్ వీ ఏసీ, సంబంధిత ఉత్పత్తులపై పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే కాకుండా.. కార్యకలాపాల సామర్థ్యాన్ని, విస్తృతిని పెంచనుంది. ఈ యూనిట్ అత్యాధునిక మౌలిక వసతులు, ఆధునిక ప్లాంట్, మెషినరీ తో ఏర్పాటుకానుంది. తద్వారా భవిష్యత్‌కు సిద్ధమైన తయారీ సామర్థ్యాలు, సాంకేతిక సమన్వయం, పోటీ సామర్థ్యం కలిగిన వాతావరణం ఏర్పడుతుంది.

# పెద్దవడుగూరులో ఘనంగా అభయ ఆంజనేయస్వామి కి పూజలు,!!



**పెద్దవడుగూరు, మే 05 క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్** మండల పరిధిలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో మనోహరంగా అలంకరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తి గీతాలతో, హనుమాన్ చాలీసా పారాయణంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది..

# ఆర్యవైశ్యుల సమస్యలపై మంత్రి టీజీ భరత్‌తో కీలక సమావేశం

**వేటపాలెం మే 5 ( క్రైమ్ కౌంటర్):** రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ ఆహ్వానం మేరకు ఆర్యవైశ్యుల ముఖ్య నాయకులు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి వివిధ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులతో పాటు బాపట్ల జిల్లా ఆర్యవైశ్యుల ప్రత్యేక సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి టీజీ భరత్ సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు మామిడిపాక హరిప్రసాద్, చీరాల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దోగిపర్తి బాలకృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గజవల్లి శ్రీనివాసరావు సహా ఇతర ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.





# భూ సమస్యలపై త్వరలోనే పూర్తి పరిష్కారం

క్రైంకౌంటర్ కోటేశ్వరరావు తాడికొండ నియోజకవర్గం : సిఆర్డిఏలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంసమీక్షలో పాల్గొన్న త్రిసభ్య కమిటీ సభ్యులు కేంద్ర సహాయక మంత్రి వర్యులు పెమ్మసాని చంద్రశేఖర్ , మున్సిపల్ శాఖ మంత్రి వర్యులు పొంగూరు నారాయణ , స్థానిక శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ కామెంట్స్

– పార్లమెంట్ అసెంబ్లీ సమావేశాల కారణంగా త్రీ మెన్ కమిటీ సమావేశం జరిగి రెండు నెలలు గడిచింది.

–రోడ్ల నిర్మాణాల వల్ల ఇళ్ళు కోల్పోతున్న వారికి పాలసీ ద్వారా ఎన్హాన్స్ చేయాలని చర్చించాము.

– ఆ రోజు వరకు సంబంధించిన కమిటీ గ్రామ కంతాలకు సంబంధించి, ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పరిష్కరించాలని చెప్పింది చర్చించాము.

– స్మశానాలు, మంజూరైన మరికొన్ని మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని మాట్లాడాము.

# గణేష్ కు నివాళులర్పించిన ఏటుకూరి బ్రహ్మయ్య



: క్రైంకౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ : పెదకూరపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త యువకుడు గణేష్ నిన్న అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకున్న పెదకూరపాడు మండల పార్టీ అధ్యక్షులు ఎటుకూరి బ్రహ్మయ్య ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాలతో వెంటనే స్పందించి తన సొంత ఖర్చులు 10000 ఆర్థిక సహాయం అందించారు .

# జనగణన 2027 ఎన్యుమరేటర్లకు కిట్ల పంపిణీ



క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి పులిమెల మాణిక్యం పల్నాడు జిల్లా,దుర్గి మండలం,ముటుకూరు గ్రామంలో జనగణన 2027 కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఈ రోజు దుర్గి తాహశిల్దార్ వరకుమార్ ఎన్యుమరేటర్లకు అవసరమైన కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాహశి ల్దారు మాట్లాడుతూ,జనగణన దేశ అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రక్రియ అని,సరైన మరియు ఖచ్చితమైన సమాచారం సేకరణకు ఎన్యుమరేటర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి, ప్రజల సహకారంతో సమగ్రంగా వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు అందజేసిన కిట్‌లలో అవసరమైన,మార్గదర్శక పుస్తకాలు,గుర్తింపు కార్డులు మరియు ఇతర పరికరాలు ఉన్నాయి. ఈ కిట్‌ల ద్వారా ఫీల్డ్‌లో పని సులభతరం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,సచివాలయసిబ్బంది మరియు ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



# మాజీసైనికుల సంక్షేమం లో సెంట్రల్ హబ్ ద్వారా సమస్యల పరిష్కరణ కు శ్రీకారం

## రాష్ట్ర త్రి దళ మాజీసైనికుల సంక్షేమ లీగ్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస వర ప్రసాద్

ది 05 మే 2026. (బాపట్ల బ్యూరో రెడ్డి వర ప్రసాద్) బాపట్ల మాజీసైనికుల ముఖ్యాలయమైన మాజీసైనికుల సంక్షేమ సంఘం వారి లీగ్ త్రి దళ మాజీసైనికులు మరియు వారి కుటుంబస్తుల సమస్యలను పరిష్కరించటం లో బాపట్ల లీగ్ వారి సెంట్రల్ హబ్ ద్వారా శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర త్రి దళ మాజీసైనికుల సంక్షేమ లీగ్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస వర ప్రసాద్ ఈ రోజు జరిగిన ఒక సమావేశం లో తెలియాచేశారు. బాపట్ల జిల్లా చీరాల మండలం పాపారాజుతోట నివాసి మాజీసైనికుడు పున్నా రావు 2012 లో మరణించగా అయన శ్రీమతి కి ఫామిలీ పెన్షన్ మంజూరు కాలేదని సత్య దేవి అధ్యక్షులు వర ప్రసాద్ కి తన గోడు తెలియచేయగా విషయాలను పరీక్షించిన పిదప మాజీసైనికుల నిర్లక్ష్యం ఉన్నట్లు గ్రహించి వర ప్రసాద్ రికార్డ్స్ వారితో మాట్లాడి తదుపరి వివరాలను సేకరించుటలో కృషి ప్రారంభించారు. గత 14 సం ల నుండి పెన్షన్ లేక ఈ రోజు పడుతున్న ఇబ్బందులు తనను దిక్కులేని స్థితికి తెచ్చాయని కుటుంబ విషయాలను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులకు విషయాలను తెలియచేసి కార్యాచరణ



ప్రారంభించారు. సత్య దేవికి మనో ధైర్యం కలిగించి త్వరలో నే మీ సమస్యలకు పరిష్కారం అందిస్తామని వర ప్రసాద్ హామీ ఇచ్చారు. ముఖ్య కార్యదర్శి మదన్ మోహన్, కోశాధికారి ఆర్ ఆర్ వి రెడ్డి మరియు మాజీసైనికులు ఆమెకు భరోసా ఇచ్చారు.

# ఒకే కుటుంబంలో మూడు పతకాలు సాధించిన పల్నాడు జిల్లా వాసులు.




క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట ప్రతినిధి.(జి.ఎం.కె. గాంధీ.)–ఎన్టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ఈ నెలలో జరిగిన పవర్ లిఫ్టింగ్ ఈక్యుబుడ్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పతకాలు సాధించారు.పల్నాడు జిల్లా గురజాల గ్రామానికి చెందిన కత్తి జ్యోతి బాబు క్రీడలు మీద మక్కువతో కరాటే,కత్తిసాము, కర్రసాము,వెయిట్ లిఫ్టింగ్,జిమ్ లాంటి మార్షల్ ఆర్ట్స్ లో ఎన్నో సంవత్సరాలనుండి సాధన చేస్తూ కుటుంబ పోషణ కోసం మరో వైపు పెయింటర్ గా తన వృత్తి ని కొనసాగిస్తూ వస్తున్నారు.తన కుటుంబం కొరకు కష్టపడుతూ విద్య మీద మక్కువతో తనకు వచ్చిన విద్య తనతో పోకుండా తన పిల్లలు, అలాగే ఈ విద్యలపై ఆసక్తి ఉన్న యువతకు శిక్షణ ఇస్తూ జిల్లా, రాష్ట్ర, దేశ వ్యాప్తంగా జరిగే పోటీలలో పాల్గొంటూ ఎన్నో పతకాలు సాధించారు. ఈ క్రమంలో ఈ నెలలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో తన కుమార్తె కత్తి.పల్లవి,కుమారుడుకత్తి.కార్తీక్ బ్రోంజ్ తో కలిసి పోటీలలో పాల్గొని మెడల్స్ సాధించారు.జ్యోతి బాబు గోల్డ్ మెడల్, పల్లవి సిల్వర్ మెడల్, బ్రోంజ్ సిల్వర్ మెడల్ సాధించి పల్నాడు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.పిల్లలు ఇద్దరు చదువుతూ ఓవైపు క్రీడలను ప్రాక్టీస్ చేస్తూ పోటీలలో పాల్గొని పథకాలు సాధిస్తున్నారు.ఈ సందర్భంగా కుటుంబాన్ని పోషిస్తూ పిల్లలను చదివిస్తూ వారికి శిక్షణ ఇస్తూ పోటీలలో పాల్గొనడానికి అయ్యే ఖర్చులతో ఆర్థికంగా ఎంతో కష్టంగా ఉందని జ్యోతి బాబు ఆవేదన వ్యక్తం చేసారు.

# పోలేరమ్మ తల్లి తిరుణాల లో పులిహోర, మజ్జిగ పంపిణీ చేసిన నామన వెంకట శివన్నరాయణ

ది 05 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో రెడ్డి వర ప్రసాద్) బాపట్ల జిల్లా చీరాల మండలం తోటవారి పాలెం లో పోలేరమ్మ తల్లి తిరుణాల సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ జనసేన పార్టీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ నామన వెంకట శివన్నరాయణ గారు ముఖ్యఅతిథిగా విచ్చేసి పంపిణీ చేశారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు ముగించుకుని శివాలయం దగ్గర ఏర్పాటుచేసిన ఉచిత పులిహోర మజ్జిగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు జనసేన పార్టీ ముందు నుంచి చేస్తుందని అలాగే ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరగటం సంతోషంగా ఉందని ఆ అమ్మవారి కరుణాకటాక్షం జనసేన పార్టీ కార్యకర్తలపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పూర్తిగా ఆరోగ్యంగా మరల ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆలయ బోర్డు మెంబర్ కొమ్మనబోయిన రజిని, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరాం ప్రసాద్, తెలుగుదేశం పార్టీ చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, బాపట్ల పోలేరమ్మ దేవస్థాన అధ్యక్షులు నరాలశెట్టి కృష్ణయ్య, ఉ ప్రధాన కార్యదర్శి రాగం శివరాం ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు కదలి లక్ష్మణ్, తిరుమల శెట్టి హనుమయ్య, వీరమహిళ



తోట కోటేశ్వరి, సిగిరిశెట్టి సంజయ్ నాయుడు, వేంపాటి పూర్ణచంద్రరావు, చెన్నం హరి,తుమ్మల శీను,గండూరి మురళి,గండి శివ మరియు జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెంచరీకి దగ్గరవుతున్న ప్రజల వద్దకి ప్రవీణ్






క్రైం కౌంటర్ కోటేశ్వరరావు అచ్చంపేట న్యూస్ : 77వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమాన్ని అచ్చంపేట మండలం మాదిపాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు లింక్ రోడ్లు,సీసీ రోడ్లు,డ్రైన్ ల నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నియోజకవర్గంలో ఇప్పటికే 60శాతం రోడ్లను నిర్మించామన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని ముఖ్యమంత్రి కి వివరిస్తామన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో అవసరమైన నిధులను తెచ్చి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమయం పట్టే సమస్యలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని సూచించారు. ఇప్పటివరకు గ్రామాభివృద్ధి సంక్షేమం కోసం 16 కోట్ల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు,విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలన్నారు. గ్రామ నాయకులతో సమావేశమై కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామంలోని కార్యకర్తల ఇళ్లలో జరిగిన కార్యక్రమాల నేపథ్యం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాలతో మాట్లాడారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య తలెత్తినా వారికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నందిగాం ఆశీర్వాదం, గంధం కోటేశ్వరరావు, ఎమ్మార్వో శ్రీనివాసరావు, మండల,గ్రామ అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## సోలార్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రవీణ్





**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు అచ్చంపేట న్యూస్ :** అచ్చంపేట మండలం గింజుపల్లి తండాలో ఎస్సీ,ఎస్టీలకు ఉత్సంగా అందిస్తున్న పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభించిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ .సూర్య ఘర్ పథకం ద్వారా సబ్సిడీతో ఉచితంగా ఏర్పాటు చేసిన సోలార్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే.విద్యుత్ ను ఆదా చేయాలనే ఉద్దేశంతో కేంద్రం సబ్సిడీతో సోలార్ ను ఏర్పాటు చేస్తుందన్న ఎమ్మెల్యే.గ్రామంలో 90% సోలార్ ప్యానల్స్ అమర్చడం పై అధికారులను అభినందించిన ఎమ్మెల్యే.అధికారులు ప్రజలకు సోలార్ విద్యుత్ పై అవగాహన కల్పించి ప్రతి ఇంటి పై సోలార్ ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలని సూచించిన ఎమ్మెల్యే. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నందిగాం ఆశీర్వాదం, దండం కోటేశ్వరరావు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు.. పదిమంది అరెస్ట్




**మే 05 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఐపీఎల్ సీజన్‌ను ఆసరాగా చేసుకుని సాగుతున్న భారీ అంతర్జాతీయ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టును అనంతపురంజిల్లా పోలీసులు రట్టు చేశారు. ఫిలిప్పీన్స్ కేంద్రంగా సాగుతున్న ఈ ఆన్‌లైన్ గేమింగ్ నెట్‌వర్క్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించి, పదిమంది నిందితులను అరెస్ట్ చేశారు. ఫిలిప్పీన్స్ వేదికగా 'డ్రీమ్ ప్లే' యాప్ ద్వారా ఈ దందా కొనసాగుతున్నట్లు గుర్తించారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో ఆకస్మిక దాడులు నిర్వహించిన పోలీసులు పదిమంది నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ముఠాకు ప్రధాన సూత్రధారి శివ అనే వ్యక్తి. అతడు ప్రస్తుతం ఫిలిప్పీన్స్ నుంచి ఈ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడు.

సిమ్ కార్డుల అక్రమ రవాణా..

ఇండియాలో సేకరించిన సిమ్ కార్డులను ఎవరికీ అనుమానం రాకుండా కార్గో జీన్స్ ప్యాంట్ల జేబుల్లో దాచి ఫిలిప్పీన్స్‌కు పంపేవారు. స్థానికులకు ఆశ చూపి, ఒక్కో బ్యాంకు ఖాతాకు రూ. 10,000 చెల్లించి వారి పేర్లతో ఖాతాలు తెరిపించేవారు. నిందితులందరూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై అంతర్జాతీయ స్థాయిలో ఈ నెట్‌వర్క్‌ను విస్తరించారు. ఫోన్ పే (గ్రాష్ట్రశీఅవూవ) లావాదేవీల ద్వారా బెట్టింగ్ సొమ్మును మళ్లించేవారు. పోలీసుల సోదాల్లో సుమారు రూ. 60 లక్షల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 15 మొబైల్ ఫోన్లు, 15 సిమ్ కార్డులు, 13ూాువీ కార్డులు, శఖం 700 కారు, 4 బైకులు, ల్యాప్‌టాప్‌లు ఉన్నాయి.

క్రికెట్ బెట్టింగ్ జోలికెళ్తే కఠిన చర్యలు: ఎస్పీ జగదీశ్

ఈ సందర్భంగా అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ మీడియాతో మాట్లాడారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడితే తప్పించుకోలేరని హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్ జోలికెళ్తే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఆన్‌లైన్ గేమింగ్ వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని తెలిపారు. బెట్టింగ్, గేమింగ్‌పై సాంకేతిక నిఘా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఐపీఎల్ సమయంలో బెట్టింగ్ ముఠాలు ఇలాంటి వినూత్న పద్ధతుల్లో యువతను ఆకర్షిస్తున్నాయని అన్నారు. ప్రజలు ఇలాంటి యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జగదీశ్ సూచించారు

## మహిళల భద్రతకే 'శక్తి' టీమ్ ప్రాధాన్యత: డీఎస్పీ ఎం.డి. మోయిన్







**వేటపాలెం మే 5 (క్రైమ్ కౌంటర్):** బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తోందని చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్ తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో మంగళవారం వేటపాలెంలోని వెంకటేశ్వర కల్యాణమండపంలో ఉమెన్ సేఫ్టీ, మాదకద్రవ్యాలపై భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆశా వర్కర్లు, మహిళా సంఘాలు, బాల్య వివాహాల నివారణ కమిటీలకు చెందిన సుమారు 300 మంది మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎం.డి. మోయిన్ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా 'శక్తి యాప్' ప్రతి మహిళ మొబైల్‌లో ఉండాలని, ఆపద సమయంలో ఈ యాప్ ద్వారా తక్షణ పోలీస్ సహాయం పొందవచ్చని వివరించారు. ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాల వంటి సామాజిక అరిష్టాలను అరికట్టడంలో యువత చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దని, అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించి, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్దాలను వివరించారు.ఏదైనా సమస్య తలెత్తినప్పుడు 112, 181, 1091, 1098 హెల్ప్‌లైన్ నెంబర్లకు వెంటనే కాల్ చేయాలని కోరారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో చీరాల రూరల్ సీఐ సుధాకర్, వేటపాలెం ఎస్ఐ జనార్దన్, శక్తి టీమ్ ఎస్ఐ హరిబాబు, పీసీలు సుబ్బారావు, సునీత, ధనలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరా నిలిపివేత.

ముందస్తుగా నిల్వలు చేసుకోవాలి –మున్సిపల్ కమిషనర్– రమ్య కీర్తన.



**క్రైమ్ కౌంటర్: నరసరావుపేట (ప్రతినిధి.జి.ఎం.కె. గాంధీ. )–పట్టణానికి సరఫరా** అయ్యే రావిపాడు రోడ్డులోని మంచినీటి పైపులలో లోపాలు ఏర్పడటం వలన ఈనెల ఏడవ తేదీ సాయంత్రం నుండి ఎనిమిదో తేదీ ఉదయం వరకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు నీటి కొరకు ఇబ్బందులు పడకుండా అవసరమైన నీటిని ముందస్తుగా నిలువ చేసుకోవాలని సూచించారు.గత కొన్ని రోజులుగా మురికిగా వస్తున్న మంచి నీటితో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.ఈ సందర్బంగా నరసరావుపేట నూతన మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన కమీషనర్ రమ్య కీర్తన పట్టణంలోని సమస్యలను పరిష్కరించే దిశగా ప్రణాళికలు చేస్తున్నారు.అందులో భాగంగా మంచి నీటి సమస్య పై దృష్టి సారించారు.ఈ మేరకు మున్సిపల్ పరిధిలోని అన్ని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార దిశగా కమీషనర్ రమ్య కీర్తన కృషి చేస్తున్నారు.

## పెరిగిన తెల్ల బంగారం ధర

**మే 05 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆదోని(కర్నూలు): కర్నూలు జిల్లా ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు భారీగా పెరిగాయి. పదిహేను రోజుల్లో పత్తిధర క్వింటాకు రూ.800 పైగా ధర పెరిగింది. ఇప్పటికే పత్తి సీజన్ ముగియడంతో అరకొర పత్తి రైతులు విక్రయానికి తీసుకొస్తుండడంతో వ్యాపారుల మధ్య పోటీ నెలకొనడంతో ధరలు పెరగడానికి కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు.అంతర్జాతీయ మార్కెట్‌లోనూ దూది ధరలు పెరి గాయని, దీంతో స్థానిక మార్కెట్ యార్డులో ధరలు పెరగడానికి మరో కారణమని తెలిపారు. ధరలు పెరగడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 758 క్వింటాల పత్తి విక్రయానికి రాగా.. గరిష్ఠ ధర రూ.9615, మధ్యస్థం రూ.9,300 కనిష్ఠం రూ.5,525 పలికింది.



## టీవీకే పార్టీ అధ్యక్షులు విజయ్ గెలుపుతో ఘనంగా విజయోత్సవ సంబరాలు




**క్రైం కౌంటర్ కారంపూడి ప్రతినిధి కోట.దివాకర్** మండలంలోని మాచర్ల రోడ్డులో తమిళనాడు టి.వి.కె పార్టీ విజయం సాధించిన సందర్బంగా యస్.సి.యూత్ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న వై యస్ అర్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా యస్ సి సెల్ అధ్యక్షులు కొమ్ము చంద్ర శేఖర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ్ దళపతి విజయం సాధించడం దళిత జాతికే గర్వకారణం అని అన్నారు. ఈ విజయాన్ని ప్రతి ఒక్క దళితులు ఆదర్శంగా తీసుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో మండల యస్ సి సెల్ ఉపాధ్యక్షులు కందుకూరి సాగర్, పట్టణ యస్ సి సెల్ అధ్యక్షులు నందిగం ఇస్సాకు, మండల యస్ సి సెల్ ప్రధాన కార్యదర్సులు కడియం పాపయ్య, గుద్దేటి నాగేశ్వరావు, మురికిపూడి కోటయ్య, కటికల రవి కుమార్, చింతపల్లి యం. పి. టి. సి అచ్యుతారావు, పాలేపోగు జోసెఫ్, కాలే రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## ఆకివీడు రామాలయం నిర్మాణంపై పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

**మే 05 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడులో రామాలయం నిర్మాణం అనుమతులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే గత 80 సంవత్సరాలుగా అక్కడ రామాలయం ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. అన్ని ఆధారాలు, రికార్డులు పరిశీలించిన తరువాత జిల్లా కలెక్టర్, నగర పంచాయితీ కమిషనర్ రామాలయం నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని పేర్కొంది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.గతంలో రామాలయం నిర్మాణాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిల్‌పై హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ జరిపిన అనంతరం.. దీనిపై ఇప్పటికే హైకోర్టు సింగిల్ బెంచ్‌లో రిట్ పిటిషన్లు ఉన్నందున అక్కడే తేల్చుకోవాలని తెలిపింది. ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని హైకోర్టు చెప్పగా.. డిస్మోజ్ చేయాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోరారు. దీంతో ఈ పిటిషన్‌ను హైకోర్టు డిస్మోజ్ చేసింది. అంతేకాకుండా పిల్‌ను ఉపసంహకరించుకున్నట్లు పిటిషనర్ల న్యాయవాది తెలిపారు. తాజాగా ఆలయ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈరోజు(మంగళవారం) హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. 80 సంవత్సరాలుగా అక్కడ రామాలయం ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉందని.. అన్నింటినీ పరిశీలించాకే కలెక్టర్, నగర పంచాయితీ కమిషనర్ అనుమతులు ఇచ్చారని పేర్కొంటూ.. పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.




Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.

జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.

ప్రకాశం



APTEL/25/A2843

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 157 బుధవారం 06- 05 - 2026 పేజిలు : 4 వెల. 2



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349




క్రైమ్ కౌంటర్ న్యూస్....మార్కాపురం జిల్లా.....మార్కాపురం పట్టణ నూతన ఎస్ ఐ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విశ్వనాథ రెడ్డిని నేడు పోలీస్ స్టేషన్ లో మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలియజేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం, ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ కె జి నరసింహం తదితరులు.....

## కేరళలో యూడీఎఫ్ ఘన విజయం: మార్కాపురంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



క్రైమ్ కౌంటర్ న్యూస్....మార్కాపురం జిల్లా... మార్కాపురం, మే 5, 2026: కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో పది సంవత్సరాల తర్వాత యుడిఎఫ్ కూటమి 2/3 వంతు మెజార్టీతో ఘన విజయం సాధించడం పట్ల మార్కాపురం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం గడియార స్తంభం ఆవరణలో పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ, “కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో కానీ, దేశంలో కానీ సోదరభావం పెంపొందుతుంది. అభివృద్ధి జరుగుతుంది, ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి. రాజ్యాంగబద్ధ పాలన అందుతుంది. అన్ని మతాల వారికి, అన్ని భాషల వారికి, అన్ని జాతుల వారికి, అన్ని ప్రాంతాల వారికి సమాన హక్కులు లభిస్తాయి. అందరినీ కలుపుకొని వెళ్లే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే” అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు: మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనార్టీ జనరల్ సెక్రెటరీ షేక్ అబ్దుల్లా, మార్కాపురం నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్, మార్కాపురం నియోజకవర్గ కేకేసీ అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్, మార్కాపురం పట్టణ కేకేసీ అధ్యక్షులు షేక్ నాగూర్ భాష, కాంగ్రెస్ నాయకులు సామెల్, షేక్ మహబూబ్ సుభాని మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.....

## 29 డిప్యూటీ కలెక్టర్ పోస్టులు ఖాళీ

క్రైం కౌంటర్ న్యూస్ , మే 05 రెవెన్యూ శాఖ పరిధిలో 2025–26 అడహక్ ప్యానెల్ సంవత్సరానికి 29 డిప్యూటీ కలెక్టర్ ఖాళీలు ఏర్పడ్డాయి. ఈమేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ జీఓ 660 ద్వారా ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఇందులో రిటైర్‌మెంట్ ద్వారా 25 ఖాళీలు ఏర్పడ్డాయి. మరో మూడు పోస్టులను రిజర్వ్‌చేయగా, ఒకటి స్వచ్ఛంద పదవీ విరమణ ద్వారా ఖాళీ ఏర్పడిందని ఉత్తర్వులో పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్‌గా పదోన్నతులు ఇచ్చే ప్రక్రియను రెవెన్యూ శాఖ ప్రారంభించింది. ఇది పూర్తికాగానే తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్ (డీసీ)లుగా పదోన్నతులు ఇచ్చేందుకు రంగం సిద్ధమవుతోంది. ఖాళీల నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏను ప్రభుత్వం ఆదేశించింది.

# పామూరులో జర్నలిస్టుల ర్యాలీ

-రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్యకు తీవ్ర నిరసన

జర్నలిస్టుల హత్యను తీవ్రంగా ఖండించిన.. సిపిఎం జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్

జర్నలిస్టులను హత్యలు చేయడం, దౌర్జన చేయటం హేయ మైన చర్య... సిఐటియు జిల్లా కోశాధికారి పాలపర్తి మస్తాన్రావు







పామూరు, మే 5, క్రైం కౌంటర్ చిత్తూరు జిల్లా వీకోటలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్యను ఖండిస్తూ మార్కాపురం జిల్లా పామూరులో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి వామపక్ష పార్టీలు, జర్నలిస్టు సంఘాలు మద్దతు తెలిపాయి. జర్నలిస్టు హత్య దేశవ్యాప్తంగా మీడియా వర్గాలను కలిచివేసిందని, నిజం కోసం పనిచేసే పాత్రికేయుడిని లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని సిపిఎం జిల్లా నాయకుడు సయ్యద్ అనీఫ్, సిఐటియు జిల్లా కోశాధికారి పాలపర్తి మస్తాన్రావు అన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ మీడియా ప్రతినిధులు పామూరు సీఐ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సీఐకి నిరసన పత్రం సమర్పించారు. దోషులు ఎవరైనా సరే వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టుల భద్రత కోసం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే స్పందించాలని జర్నలిస్ట్ లు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాగిపాటి సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఖాజా మొహిద్దిన్, గౌరవాధ్యక్షులు ఇర్రి హజరత్తు రెడ్డి, కన్వీనర్ నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి కరీమ్, అబ్దుల్ ఖాదర్, రఘురామ్, ఉప్పుగండ్ల రమేష్, జమకాల నరేష్, రాజేష్, రఫి, సాయి, లక్ష్మీనారాయణ, , రహిమాన్, ఉపాధ్యక్షుడు ఆరియారం ఏడుకొండలు, రషీద్, వెంకట్రావు వామపక్ష నాయకులు మాజీ జిల్లా నాయకులు సయ్యద్ అనీఫ్, మాల్యాద్రి, వజ్రాల సుబ్బారావు, మస్తాన్ రావు, గౌస్ భాషా పాల్గొన్నారు.

# విద్యార్థులకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి

క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు, ఇటీవల జరిగిన 10వ తరగతి పరీక్షల్లో, కందుకూరు డివిజన్ స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ఘనంగా సత్కరించి అభినందించారు.


తాటితోటి సాయిలక్ష్మి జస్వంతి (590), వీరేపల్లి మోడల్ స్కూల్ – ఉలవపాడు మండలం కటారి శ్రీకన్య (587), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరేడు – ఉలవపాడు మండలం జి. హేమశ్రీ (587), జి మేకపాడు మోడల్ స్కూల్ – కందుకూరు మండలం కే. శివప్రసాద్ (585), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొమ్మి – కొండాపురం మండలం మేడసాని మోక్ష సాయిశ్రీ (585), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మారెడ్డిపల్లి – వరికుంటపాడు మండలం బాలం వెంకటసాయి హరిత ఆర్తి (584), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల – లింగసముద్రం,

ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, ఈ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల హెచ్ఎం లనుఆయన ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూలివిద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన 100 రోజుల ప్రణాళిక కారణంగా, ఈఏడాది అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు గర్వించదగ్గ స్థాయిలో ఫలితాలను సాధించారని అన్నారు. లోకేష్ ప్రత్యేక దృష్టితో పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించడం ఒక కారణమన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పుస్తకాలు, బ్యాగులు ఇవ్వడం, నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామన్నారు. సింగపూర్ లో విద్యావిధానం పరిశీలనకు పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం పంపించడం, అసెంబ్లీలో విధివిధానాలపై అవగాహన పెంచేందుకు విద్యార్థులతో మాకు అసెంబ్లీ




నిర్వహించడం లాంటి మంచి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. పదవ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం ఉంటుందని ఎమ్మెల్యే తెలియజేశారు. పేద కుటుంబాల నుంచి వచ్చి, టాప్ ఫలితాలు సాధించడం గర్వకారణం అన్నారు. ఇంకా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను లోకేష్ తీర్చిదిద్దుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ నరసింహారావు, ఎంపీడీవో రత్నజ్యోతి, కందుకూరు ఎంఈఓలు శర్మ, సుబ్బారెడ్డి, డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పెషల్ ట్రీట్.. ఇంట్లోనే సహపంక్తి భోజనం



క్రైం కౌంటర్ న్యూస్ , మే 05 పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా మార్కులు సాధించి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడంలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఒక అడుగు ముందుకేసి, అందరికీ ఆదర్శంగా నిలిచారు. తన నియోజకవర్గమైన నర్సీపట్నం నుంచి టెన్త్ క్లాస్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయన తన సొంత నివాసంలోనే విందు ఇచ్చారు. నర్సీపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా 580 కంటే ఎక్కువ మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులను స్పీకర్ తన ఇంటికి ఆహ్వానించారు. కేవలం అభినందనలకే పరిమితం కాకుండా, ఆ విద్యార్థులతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ హోదాలో ఉండి కూడా, సామాన్య విద్యార్థులతో కలిసి భోజనం చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన అయ్యన్నపాత్రుడు, వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విజయాన్ని గుర్తిస్తూ వారిని శాలువాలతో సత్కరించారు. అంతేకాకుండా, మన సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఏటికొప్పాక కళాకారులు తయారు చేసిన సరస్వతీ దేవి విగ్రహాలను జ్ఞాపికలుగా అందజేశారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని కొనియాడుతూ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలు, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ వల్లే విద్యార్థులు ఈ స్థాయికి చేరుకున్నారు అని అయ్యన్నపాత్రుడు ప్రశంసించారు. రాష్ట్ర స్పీకర్ తమను పిలిచి గౌరవించడం, వారితో ఫోటోలు దిగడం విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమం కేవలం ఆ 11 మందికే కాకుండా, మిగిలిన విద్యార్థులకు కూడా స్ఫూర్తినిచ్చేలా సాగింది. ఉన్నత పదవుల్లో ఉన్న వారు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై సమాజంలో నమ్మకం మరింత పెరుగుతుందనడంలో సందేహం లేదు.



# కార్డెన్ సెర్చ్

కావలి కంచర్ల మల్లికార్జున రావు క్రైం కౌంటర్ ప్రతినిధి,పట్టణంలోని తుపాన్ నగర్ ప్రాంతంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ మంగళవారం నిర్వహించారు . డీఎస్పీ రమణ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలను చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 25 బైకులు, 3 ఆటోలు, ఒక ట్రాక్టర్ ను సీజ్ చేశారు. అనంతరం కావలి డీఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ..ఈ కార్యక్రమాన్ని డివిజన్ లో రోజుకో స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు పని చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించి సమాజ క్షేమం కోసం పాటుపడాలని కోరారు.

# ఆహ్వాన పత్రిక అందజేత




క్రైం కౌంటర్ ప్రతినిధి కందుకూరు టౌన్ ,వైస్సార్సీపీ కార్యాలయం లో మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ కు లింగసముద్రం మండలం వాకమళ్లవారి పాలెం గ్రామం లో గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి, సీతారాములు, అయ్యప్ప స్వామి ద్వజస్థభం మహా ప్రతిష్ట ఆహ్వాన పత్రిక ను ఆలయ కమిటి సభ్యులు వైసీపీ కార్యాలయంలో మంగళవారం అందజేశారు.

## పాస్ పుస్తకాలు అందజేత! ఎమ్మెల్యే ఇంటూరి



వలేటివారిపాలెం క్రైం కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి, మండలంలోని కొండసముద్రంలో పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం పంపిణీ చేశారు.458 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు.గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిచేసి కొత్త పుస్తకాలను అందజేస్తున్నామని చెప్పారు.
అనుభవంలేక జగన్ చేయించిన రీసర్వేతో చిక్కులు వచ్చాయి. ఇప్పుడు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని చెప్పారు.అన్నదాత సుఖీభవ నిధులు రైతులను కష్టకాలంలో ఆదుకుంటున్నాయనీ తెలిపారు.రైతుల మేలుకోరే నాయకుడు చంద్రబాబు నాయుడు ఒక్కరే అన్నారు. పాసుపుస్తకాల పంపిణీ తరువాత ప్రజాదర్బార్ ను చేపట్టామన్నీ అన్నారు. ప్రజలనుంచి అర్జీలు స్వీకరించి, అధికారులకు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో శంకర్రావు, మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షులు ఘట్టమనేని సుబ్బారావు, పార్టీ నేతలు ఘట్టమనేని మాధవరావు, ఆదిశేషయ్య, చిరంజీవి, రాము, ఉన్నం సురేష్, తానికొండ రమణయ్య, కోటపాటి మాల్యాద్రి, మన్నం శ్రీను, నాగేశ్వరరావు, నవులూరి రాజారమేష్, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, వడ్లమూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ ఉద్యోగుల వివాదం పాత బెంచ్‌కే: సుప్రీం

క్రైం కౌంటర్ న్యూస్ , మే 05 తెలుగు రాష్ట్రాల మధ్య విద్యుత్ ఉద్యోగుల విభజన(కేటాయింపు) వివాదం మరోసారి సుప్రీంకోర్టుకు చేరింది.‘ స్టేట్ క్యాడర్’ విభజన కోసం నిర్దేశించిన నిబంధనలు, తీర్పులు ‘జోనల్ క్యాడర్’ ఉద్యోగులకు వర్తించవన్న పిటిషనర్ వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. దీనికి సంబంధించిన పిటిషన్లను గతంలో ఉద్యోగుల కేటాయింపు అంశాలను విచారించిన బెంచ్‌కే బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎం.హసన్ నజ్కీ వాదనలు వినిపించారు.

# 6 న అద్దంకిలో శాస్త్రికి పుట్టంరాజు విశిష్ట సాహిత్య పురస్కారం ప్రదానం



: ఒంగోలు క్రైం కౌంటర్ ప్రతినిధి, నగరంకుచెందిన ప్రముఖ సాహిత్యవేత్త బహు గ్రంథకర్త అక్షర సాహితీ సమితి అధ్యక్షులు టిటిడి ధర్మాచార్య ఎం వి ఎస్ శాస్త్రిని . ఈ నెల 6వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు అద్దంకిలోని పుట్టంరాజు కళా క్షేత్రంలో ఏర్పాటయ్యే కార్యక్రమంలో పుట్టంరాజు బుల్లెయ్య రామ లక్ష్మమ్మల విశిష్టసాహిత్య పురస్కారంతో ఘనంగా సత్కరించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి వెల్లడించారు.శతావధాని నారాయణం బాల సుబ్రహ్మణం కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు .ఎం వి ఎస్ శాస్త్రి రచించిన పుస్తకాలపై పోలూరు శివ రామ ప్రసాద్,. వారణాసి రఘురామ శర్మ,. గాడేపల్లి దివాకర దత్తు, .డి వి ఎం . సత్యనారాయణ, ఆర్ వి . రాఘవరావు తదితరులు సమీక్ష నిర్వహిస్తారు. సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంత ం చేయాలని నిర్వాహకులు కోరారు.

## కంభంపాడు గ్రామంలో జూదంపై పోలీసుల దాడి 4 మంది అదుపులోకి, నగదు స్వాధీనం




క్రైమ్ కౌంటర్ న్యూస్....మార్కాపురం జిల్లా.... పెద్దారవీడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కంభంపాడు గ్రామం పంట పొలాల్లో జూదం నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో జూదంలో పాల్గొంటున్న 4 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3,200 నగదును స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు.....

## అనంతబాబు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతి

క్రైం కౌంటర్ న్యూస్ , మే 05 వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కస్టడీ పిటిషన్‌పై కాకినాడలోని స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. ఆయన్ను ఒకరోజు పోలీసు కస్టడీకి అనుమతి మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అనంతబాబును 3 రోజుల పాటు విచారణ కోసం అప్పగించాలని దర్యాప్తు అధికారులు కోరారు. కనీసం 2 రోజులైనా ఇస్తారని పోలీసులు భావించినా న్యాయమూర్తి మాత్రం ఒక్కరోజే అనుమతించారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అనంతబాబును మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి కాకినాడ తీసుకురానున్నట్టు దర్యాప్తు అధికారి, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు 24 గంటల పాటు విచారణ చేపట్టనున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సర్పవరం పోలీసు స్టేషన్ పరిసరాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కాగా, అనంతబాబుపై దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఇప్పటికే నమోదయ్యాయి. తమకు అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే చంపేస్తామని ఆయన బెదిరించి, నిర్బంధించిన నలుగురు యువకులు ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు కావడంతో ఈ కేసులో ఉన్నవారందరిపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు.

ఆ ఇద్దరూ ఏమైనట్టు..?

సాక్షులను బెదిరించిన కేసులో ఏ2, ఏ3గా ఉన్న కడియాల చిన్నబాబు, కడియాల సతీశ్ ఆచూకీని పోలీసులు కనిపెట్టలేకపోతున్నారు. దాదాపు 15 రోజులుగా వారు పరారీలోనే ఉన్నారు. ఫోన్లు స్విచ్ ఆఫ్ కావడంతో వారిని పట్టుకోవడం కష్టంగా ఉందని చెబుతున్నారు. వారి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిచి విచారించినా ఆచూకీ లభ్యం కావడం లేదని అంటున్నారు.





## భోజనం’లో రాగిజావ మరో మూడేళ్లు

క్రైం కౌంటర్ న్యూస్ , మే 05 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు అదనపు పోషకాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రస్తుతం శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో అమలు చేస్తున్న రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మరో మూడేళ్లు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 2026–29 కాలానికి విద్యార్థులకు రాగిజావ పంపిణీని కొనసాగించేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ (అవగాహన ఒప్పందం) కుదుర్చుకుంది. ట్రస్ట్ సహకారంతో రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు రాగి జావ పంపిణీని 2023, మార్చిలో ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 44 వేల పాఠశాలల్లో దాదాపు 33 లక్షల మంది విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అడ్మిన్ కో–ఆర్డినేటర్ ఎస్.జి.చలం, శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఏపీ విభాగం అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావుతోపాటు మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



## మట్టిలో మాణిక్యాలకు విమానయోగం!

క్రైం కౌంటర్ న్యూస్ , మే 05 మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలన్న ఉద్దేశంతో.. ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలి ఏడాది నుంచే ఆమె తన నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు విమానం ఎక్కే అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన కంచికచర్ల మండల విద్యార్థి ఎస్‌కె అర్షియనాజ్ (589 మార్కులు), నందిగామ మండల విద్యార్థి ప్రజాప్రతి ప్రవీణ్ (576), వీరులపాడు మండల విద్యార్థి స్వరం వర్షిత (571), ముప్పాళ్ల గురుకుల పాఠ శాల విద్యార్థి పల్లెపోగు వెన్నెల (567), చందర్లపాడు మండల విద్యార్థి నారిశెట్టి జగదీశ్ ఆదిత్య (559), నందిగామ విద్యార్థి ఉప్పులూరి సోనీప్రియ (549)లను ఈ యాత్రకు ఎంపిక చేశారు. మంగళవారం ఉదయం తంగిరాల సౌమ్యతో కలిసి ఈ విద్యార్థులు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు విమాన ప్రయాణం చేయనున్నారు.



## మోదీపై ప్రజలకు విశ్వాసం పెరిగింది: బీజేపీ

క్రైం కౌంటర్ న్యూస్ , మే 05 దేశం కోసం నిరంతరం శ్రమిస్తోన్న ప్రధాని మోదీపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగిందని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్య కుమార్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అభిప్రాయపడ్డారు. అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలతో విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ.. ‘మోదీ పాలనలో దేశ భద్రతపై ఉన్న నమ్మకమే అసోమ్, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయానికి కారణమైంది. అసోమ్, పుదుచ్చేరి ప్రజలు మరోమారు బీజేపీని గెలిపించడం అక్కడి పాలనకు నిదర్శనం’ అని పేర్కొన్నారు.పశ్చిమ బెంగాల్‌లో గెలుపు దేశాభివృద్ధికి మలుపు: మాధవ్పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ గెలుపొందడం దేశాభివృద్ధికి మరింత దోహదపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో సోమవారం బీజేపీ విజయోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బెంగాల్‌లో బీజేపీ గెలుపుతో ఆ రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతమవుతుందని మాధవ్ పేర్కొన్నారు.

## నేషనల్ హెల్త్ మిషన్ ఎస్పీఓగా జె.విజయలక్ష్మి

### రెండేళ్ల తర్వాత పోస్టు భర్తీ

### ఆరోగ్య శాఖలో ఐదుగురికి జేడీలుగా పదోన్నతి

**క్రైం కౌంటర్ న్యూస్ , మే 04** ఆరోగ్యశాఖలో ఐదుగురు డిప్యూటీ డైరెక్టర్లకు ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్లు(జేడీ)గా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ డైరెక్టర్లుగా ఉన్న వి.వెంకట శేషారెడ్డి, జె.విజయలక్ష్మి, ఎస్.సృజన, ఆర్.గణపతిరావు, ఎల్.శ్రీనివాసరావుకు జేడీలుగా పదోన్నతి పొందారు. ప్రమోషన్ పొందిన వారికి పోస్టింగులు ఇస్తూ, 15 రోజుల్లోగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో ఉన్న వి.వెంకట శేషారెడ్డికి డీఎంఈ కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చింది. అలానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖాళీగా ఉన్న నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్(ఎన్‌హెచ్ఎం ఎస్పీఓ) పోస్టును ఆరోగ్య శాఖ ఎట్టకేలకు భర్తీ చేసింది. కీలకమైన ఈ పోస్టులో జె.విజయలక్ష్మిని నియమించింది. అలానే విశాఖ ఆర్డీ కార్యాలయంలో ఉన్న ఎస్.సృజనను నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా నియమించింది. ఏపీ శాక్స్‌లో డీడీగా ఉన్న ఆర్.గణపతిరావుకు డీఎంఈ కార్యాలయంలో జేడీగా పోస్టింగ్ ఇచ్చింది. రాజమండ్రి ఆర్డీ కార్యాలయంలో డీడీగా ఉన్న ఎల్ శ్రీనివాసరావును ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ అడ్మిన్ ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

## ఏపీలో మరో భారీ పెట్టుబడి..
## 3 వేల మందికి ఉద్యోగాలు!

**క్రైం కౌంటర్ న్యూస్ , మే 05**: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధి అవకాశాల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ఇప్పటికే 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసి, దానికి మంత్రి నారా లోకేష్‌ను చైర్మన్‌గా నియమించిన ప్రభుత్వం అదే దిశలో చర్యలు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రానికి కొత్తగా పెట్టుబడులు రావడం, పరిశ్రమలు స్థాపించడంపై దృష్టి పెట్టడం వల్ల ఉపాధి అవకాశాలు క్రమంగా పెరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే తిరుపతి జిల్లా శ్రీసిటీలో మరో పెద్ద పరిశ్రమ స్థాపనకు రంగం సిద్ధమైంది. అమెరికాకు చెందిన ప్రముఖ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ క్యారియర్ తన కొత్త తయారీ యూనిట్‌ను ఇక్కడ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 3 వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. శ్రీసిటీ పారిశ్రామికవాడలో 39 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను అభివృద్ధి చేయనున్నారు. మొత్తం మూడు దశల్లో 2028 నాటికి సుమారు రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్ పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుంది రేపు ఈ పరిశ్రమకు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు. దేశంలో ఇప్పటికే ఐదు దశాబ్దాలకు పైగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న క్యారియర్ సంస్థకు తయారీ, సాంకేతిక రంగాల్లో మంచి అనుభవం ఉంది. ప్రస్తుతం హర్యానాలోని గుర్‌గ్రామ్‌లో తయారీ యూనిట్, హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నిర్వహిస్తున్న ఈ సంస్థ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కూడా తన ఉనికిని విస్తరించనుంది.శ్రీసిటీలో ఏర్పాటు కానున్న ఈ ప్లాంట్ ప్రధానంగా హెచ్‌వీఏసీ (ఎవాూజ) మరియు అనుబంధ ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించనుంది. దేశంలో, అంతర్జాతీయంగా పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆధునిక సాంకేతికతతో ఈ యూనిట్‌ను నిర్మించనున్నారు. అత్యాధునిక మౌలిక వసతులు, ఆధునిక ప్లాంట్ అండ్ మెషినరీతో ఈ యూనిట్ రూపొందించబడనుంది.ఈ పరిశ్రమ స్థాపనతో ప్రత్యక్షంగా మాత్రమే కాకుండా పరోక్షంగా కూడా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశముంది. స్థానికంగా లాజిస్టిక్స్, సప్లై చైన్, సేవల రంగాల్లో కూడా ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయి.శ్రీసిటీ ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకు కేంద్రంగా మారిన నేపథ్యంలో, కొత్త పెట్టుబడులు రావడం ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుంది. గత కొంతకాలంగా రాష్ట్రంలో పరిశ్రమల పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం, వేగవంతమైన అనుమతుల ప్రక్రియ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి పెట్టడం వల్లే కొత్త ప్రాజెక్టులు రాష్ట్రాన్ని ఎంపిక చేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పలు రంగాల్లో పెట్టుబడులు రావడంతో పాటు కొత్త ప్రాజెక్టులు ప్రకటించబడుతున్నాయి. ఈ ధోరణి కొనసాగితే రాబోయే కాలంలో ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.




మొత్తానికి, శ్రీసిటీలో క్యారియర్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఈ తయారీ యూనిట్ రాష్ట్రంలో ఉపాధి అవకాశాల విస్తరణలో మరో అడుగుగా నిలుస్తోంది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పరిశ్రమల ద్వారా ఉద్యోగాల కల్పన దిశగా జరుగుతున్న ప్రయత్నాల్లో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా భావించవచ్చు.

# కొరత లేకుండా మంచినీటి సరఫరా

**జిల్లాకు ప్రత్యేకంగా రూ. కోటి కేటాయిస్తున్నాం.. 24 గంటల్లోనే వాహనాల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి**

**అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా డీలర్లు**

**ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగం పెంచాలి**

**కలెక్టర్లు, ఉన్నతాధికారులకు సీఎం ఆదేశం**



**క్రైం కౌంటర్ న్యూస్ , మే 05** ఈ వేసవికాలంలో రాష్ట్రంలో మంచినీటి కొరత రాకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మంచి నీటి సరఫరా కోసం ప్రతి జిల్లాకు ప్రత్యేకంగా రూ. కోటి చొప్పున విడుదల చేయాలని సీఎస్ జి.సాయిప్రసాద్‌ను ఆదేశించారు. సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, అధికారులు, ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులతో సీఎం సమావేశమయ్యారు. మంచి నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని, జిల్లాల్లో బోర్లు కూడా మరమ్మతులు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్లను మరింత సరళీకృతం చేయాలని రవాణాశాఖకు సీఎం సూచించారు. వాహన డీలర్లను అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా గుర్తించేందుకు అనుమతిని ఇచ్చారు. వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 24 గంటల్లో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వం అందించే పౌర సేవల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం పెంచేందుకు వీలుగా నిపుణులతో కూడిన సలహామండలిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో డ్రోన్ల వినియోగం పెంచేలా ఓ వర్క్‌షాప్ నిర్వహించాలన్నారు. అవేర్ సాంకేతికతను వినియోగించుకుని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రాంతాల్లో వడగాడ్పులకు గురికాకుండా ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థల సేవలను తీసుకోవాలని చెప్పారు. అత్యవసర సేవలు మినహా అన్నీ ఆన్‌లైన్‌లోనే చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల సేవలు సులువుగా అందించేందుకు, కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగకుండా ఉండేందుకు ఈ ఆన్‌లైన్ సేవలు పెంచాలని నిర్దేశించారు. పంటలకు ధర కల్పించే విషయంలోనూ రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు మార్కెట్ ధరలను విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు కూడా అవసరమని, కార్యదర్శుల స్థాయి అధికారులు నెలలో మూడు రోజులు, హెచ్ఓడీలు ఆరు రోజులు, కలెక్టర్లు ఎనిమిది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించేలా అత్యుత్తమ విధానాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపితే అత్యుత్తమ ఫలితాలు వస్తున్నాయని చెప్పారు.

పారిశ్రామిక క్లస్టర్లకు లాజిస్టిక్స్ కనెక్టివిటీ

రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్ కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆర్టీజీఎస్ నుంచి ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్లపై సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల పరిధిలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్ల గురించి చర్చించారు. రాష్ట్రంలోని ఎంఎ?సఎంఈల్లోని ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో తయారు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులను స్థానిక, ప్రాంతీయ, దేశవిదేశీ మార్కెట్లకు చేర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్వే, పోర్టు కనెక్టివిటీ ఉండేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ చేయాలని చెప్పారు.

పారిశ్రామిక క్లస్టర్ వద్ద టౌన్‌షిప్‌లు

ప్రతి పారిశ్రామిక క్లస్టర్ వద్ద ఇండస్ట్రియల్ టౌన్‌షి?పల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ ప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా ఎంఎస్ఎంఈల స్థాపనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో ఉండాలని నిర్దేశించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించాలని చెప్పారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్ జరగాలన్నారు. యూనివర్సిటీల్లోనూ నైపుణ్య కోర్సులను హైబ్రిడ్ విధానంలో అందించే ఆలోచన చేయాలని సూచించారు.

# వ్యవసాయం నుండి సెమీకండక్టర్ల వరకు..
# మోదీ సర్కార్ సంచలన నిర్ణయాలు..!



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం (మే 05) జరిగిన కేంద్ర మంత్రివర్గం సంచలన నిర్ణయాలు తీసుకుంది. తాజాగా దేశ ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలైన వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, పారిశ్రామిక అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలు భారతదేశాన్ని స్వావలంబన దిశగా నడిపించడమే కాకుండా, లక్షలాది మంది రైతులు, చిన్న తరహా పరిశ్రమలకు ఊతాన్నిచ్చేలా ఉన్నాయి.కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలలో అత్యంత ముఖ్యమైనది 'కాపస్ కాంతి మిషన్'. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారుగా ఉన్న భారతదేశం, 2030-31 నాటికి పెరగనున్న 4.5 కోట్ల బేళ్ల దేశీయ డిమాండ్‌ను అందుకోవడమే లక్ష్యంగా ఈ మిషన్‌ను ప్రారంభించింది. ఇందుకోసం 5,659 కోట్ల రూపాయల బడ్జెట్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకు 2026-27 నుండి 2030-31 వరకు కాలపరిమితిని విధించారు. సుమారు 32 లక్షల మంది పత్తి రైతులకు నూతన సాంకేతికతలు, పరిశోధనలు, మెరుగైన విత్తనాల ద్వారా మేలు జరుగుతుంది. అదేవిధంగా, చెరకు రైతుల కోసం 2026-27 సీజన్‌కు గాను కనీస మద్దతు ధర (ఖీ=ా)ని కేంద్రం ఖరారు చేసింది. దీనివల్ల దాదాపు ఒక లక్ష కోట్ల ఆర్థిక ప్రయోజనం నేరుగా రైతులకు చేరనుంది, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతాన్నిస్తుంది.

చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఎదుగుదలకు తోడ్పాటునందిస్తూ, మోదీ ప్రభుత్వం ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ 5ను పొడిగించింది. ఇందు కోసం 18,100 కోట్ల రూపాయలను కేటాయించింది. చిన్న వ్యాపారులకు సరసమైన వడ్డీతో సులభంగా రుణాలు అందించి, వారి వ్యాపారాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.

సాంకేతిక రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా, సెమీకండక్టర్ తయారీలో రెండు కొత్త యూనిట్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. 3,068 కోట్ల రూపాయల వ్యయంలో క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్, 868 కోట్ల రూపాయల వ్యయంతో సుచి సెమికాన్ యూనిట్లకు కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో చిప్ తయారీని వేగవంతం చేసి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. రవాణా మరియు వాణిజ్యాన్ని మెరుగుపరిచేందుకు భారీ పెట్టుబడులను కేటాయించారు. ఓడరేవుల అభివృద్ధిలో భాగంగా గుజరాత్‌లోని వడినార్‌లో రూ. 1,570 కోట్లతో అత్యాధునిక ఓడల మరమ్మతు కేంద్రం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే దేశవ్యాప్తంగా రైల్వే కనెక్టివిటీ పెంచాలని కేంద్ర మంత్రి మండలి నిర్ణయించింది. ఇందులో భాగంగా కీలకమైన మూడు రైల్వే లైన్ల విస్తరణకు ఆమోదం లభించింది.

నగదమతుర లైన్: రూ. 16,403 కోట్లు.

గుంతకల్వాడి లైన్: రూ. 4,758 కోట్లు.

బుర్వాల్-సీతాపూర్ లైన్: రూ. 2,276 కోట్లు.

ఈ మార్గాల్లో అదనపు ట్రాక్‌ల నిర్మాణం వల్ల రైళ్ల వేగం పెరగడమే కాకుండా, సరుకు రవాణాలో జాప్యం తగ్గుతుంది.

కేంద్ర కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయాలు కేవలం నిధుల కేటాయింపు మాత్రమే కాకుండా, దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులు. అటు పత్తి, చెరకు రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూనే, ఇటు మౌలిక సదుపాయాలు, సెమీకండక్టర్ వంటి భవిష్యత్ టెక్నాలజీలపై దృష్టి సారించడం విశేషం. న్యాయ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా సుప్రీం కోర్టు కోసం తీసుకున్న నిర్ణయాలు కూడా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే, ఈ ప్యాకేజీ దేశ సమగ్ర వృద్ధికి దిక్సూచిగా నిలుస్తుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

## పాలన నచ్చితే ప్రజలే గెలిపిస్తారు!

**క్రైం కౌంటర్ న్యూస్ , మే 05**: పాలన నచ్చితే ప్రజలు మళ్లీ గెలిపిస్తారని, లేకుంటే నిర్దాక్షిణ్యంగా ఓడిస్తారనేందుకు తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే ఉదాహరణ అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. నాలుగు రాష్ట్రాలు, ఒక యూటీ ఎన్నికల్లో గెలుపొందిన వారికి ఆయన సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. "తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రజలు మార్పును బలంగా కోరుకున్నారు. అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీ తమ ప్రాభవాన్ని నిలబెట్టుకుని, పశ్చిమ బెంగాల్‌లో ప్రజల మనసును గెలుచుకుంది. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే బెంగాల్ సురక్షితంగా, సుభిక్షంగా ఉంటుందన్న గట్టి విశ్వాసంతో ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టారు' అని పవన్ పేర్కొన్నారు. పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్ నేత, సీఎం రంగసామికి శుభాకాంక్షలు చెప్పారు. తమిళనాడు, కేరళ ప్రజలు మార్పును కోరుకున్నారని పవన్ అన్నారు. పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే చక్కటి విజయం సాధించిన విజయ్‌ను, కేరళలో గెలిచిన యూడీఎఫ్ కూటమి నాయకులను అభినందించారు.



## సినిమా



# జీవిత కంటే ముందు ఆ హీరోయిన్ నుంచి పెళ్లి ప్రపోజల్

మొన్నటి వరకు హీరోగా మాత్రమే సినిమాలు తీసిన రాజశేఖర్ ఇప్పుడు సహాయక నటుడిగానూ రాణిస్తున్నారు. యంగ్ హీరోల సినిమాల్లోనూ కీలక పాత్రలతో ఆకట్టుకుంటున్నారు. ఆ మధ్యన నితిన్ 'ఎక్స్ ట్రార్డినరి మ్యాన్' మూవీలో కనిపించిన రాజశేఖర్ లేటెస్ట్ గా బైకర్ సినిమాలోనూ ఓ కీలక పాత్ర పోషించారు. శర్వానంద్ తండ్రి సునీల్ నారాయణ్ అలియాస్ బుల్లెట్ సునీల్ పాత్రలో అద్భుతంగా నటించారు. కొన్ని సీన్లలో అయితే తన యాక్టింగ్ తో కన్నీళ్లు తెప్పించారు యాంగ్రీమ్యాన్. సినిమా కూడా సూపర్ హిట్ కావడంతో రాబోయే రోజుల్లో రాజశేఖర్ మరింత బిజీ కావొచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాగా సినిమా ప్రమోషన్లలో భాగంగా పలు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు రాజశేఖర్. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇప్పుడవి నెట్టింట వైరల్ అవుతున్నాయి.కాగా రాజశేఖర్, జీవితలు ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఎన్నో సినిమాల్లో హీరో, హీరోయిన్లు గా నటించిన వీరు ప్రేమికులుగా మారారు. ఆ తర్వాత పెద్దల అంగీకారంతో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. అయితే జీవిత కంటే ముందు శ్రీదేవితో తనకు పెళ్లి ప్రపోజల్ వచ్చిందని రాజశేఖర్ అంగీకరించారు. శ్రీదేవి తండ్రికి, మా నాన్నగారికి మధ్య మంచి స్నేహం ఉండేది. ఆ చొరవతో ఇరువైపులా స్నేహితుల మధ్య పెళ్లి ప్రపోజల్ వచ్చిన మాట నిజమే. మా కులం కూడా ఒకటే. దూరపు బంధువులు అవుతారు. అందుకే శ్రీదేవి ఫ్యామిలీ నుంచి నాకు పెళ్లి ప్రపోజల్ వచ్చింది. అప్పటికీ నేను ఇంకా సినిమాల్లోకి రాలేదు. ఎంఎస్ చదవాలనుకుంటున్నాను. ఇదే విషయాన్ని మా నాన్న వాళ్లకు చెప్పి వారి ప్రపోజల్‌ని రిజెక్ట్ చేశారు. సినిమాల్లో నటించేవాళ్లను పెళ్లి చేసుకోవడం మా ఇంట్లోవాళ్లకు ఇష్టం లేదు. అందుకే శ్రీదేవితో పెళ్లి ప్రపోజల్‌ని పక్కన పెట్టారు. అయితే శ్రీదేవి ఇప్పుడు మన మధ్య లేరు. అందుకే ఈ విషయం గురించి మనం మాట్లాడడం సరికాదు. అందుకే ఎక్కడా ఈ విషయం గురించి చెప్పను' అని రాజశేఖర్ చెప్పుకొచ్చారు.



# బొప్పాయి కొనుగోలు చేసే ముందు ఈ విషయాలు గుర్తుపెట్టుకోండి



మార్కెట్‌లో కనిపించే నారింజ రంగు బొప్పాయిలన్నీ అసలైనవి కావు. సహజంగా పండిన బొప్పాయిలు సాధారణంగా పసుపు, ఆకుపచ్చ రంగుల మిశ్రమంతో ఉంటాయి. రసాయనికంగా పండించిన బొప్పాయిలు అసాధారణంగా అందంగా, మచ్చలు లేకుండా అంతా ఒకే రంగులో కనిపిస్తాయి. ఇవి ఆరోగ్యానికి చాలా హానికరం. చెట్టు మీద పండిన బొప్పాయి తొక్క ఎప్పుడూ పూర్తిగా నునుపుగా లేదా జిడ్డుగా ఉండదు. దానిపై చిన్న నల్లటి మచ్చలు ఉంటాయి. అదే కార్బైడ్‌లో పండించిన బొప్పాయి ఉపరితలం చాలా నునుపుగా ఉండి, పసుపు రంగులో పండు మొత్తం ఏకరీతిగా కనిపిస్తుంది. మోసపోకుండా ఉండటానికి కొనుగోలు చేసేటప్పుడు తొక్క ఆకృతిని జాగ్రత్తగా గమనించడం చాలా ముఖ్యం.

సహజంగా పండిన బొప్పాయికి దాని స్వంత తియ్యని సువాసన ఉంటుంది. కానీ రసాయనికంగా పండించిన బొప్పాయిలకు సహజమైన సువాసన ఉండదు. కొన్నిసార్లు చేదు వాసన కూడా వస్తుంది. అందువల్ల కొనే ముందు కాయ వాసన చూడటం మరో ముఖ్యమైన చిట్కా. బొప్పాయి మెత్తదనాన్ని దాని గుంటలున్న వైపున తేలికగా నొక్కి పరీక్షించండి. సహజంగా పండిన బొప్పాయిలు అన్ని వైపులా సమానంగా మెత్తగా, రసవంతంగా ఉంటాయి. కృత్రిమంగా పండించిన బొప్పాయిలు బయట పసుపు రంగులో కనిపించినప్పటికీ, లోపల చాలా గట్టిగా ఉంటాయి. అందువల్ల అవి తినడానికి అంత రుచిగా ఉండవు. సహజంగా పండిన పండు కాండం, దాని చుట్టూ ఉండే భాగం సాధారణంగా కొద్దిగా మెత్తగా, ముడతలు పడి ఉంటుంది. ఒకవేళ బొప్పాయి పండు ప్రకాశవంతమైన రంగులో ఉండి, దాని కాండం చాలా గట్టిగా ఉంటే అది రసాయన ప్రక్రియ ద్వారా పండించబడిందని అర్థం చేసుకోవాలి. కృత్రిమంగా పండించిన పండు కాండం భాగం ఎప్పుడూ సహజంగా ఎండిపోదు.

బొప్పాయిని కోసినప్పుడు దాని గింజలు నల్లగా ఉండి, జెల్లీ లాంటి పొరతో కప్పబడి ఉంటే అది సహజమైన పండుగా గుర్తించాలి. కార్బైడ్‌తో పండించిన బొప్పాయి గింజలు సాధారణంగా తెల్లగా లేదా అపరిపక్వంగా ఉంటాయి. ఎందుకంటే ఆ పండు సహజంగా పోషణ పొందడానికి సమయం ఉండదు. గింజల రంగును చూడగానే అసలైనదానికి, నకిలీదానికి మధ్య తేడా స్పష్టంగా తెలుసుకోవచ్చు. సహజంగా పండిన బొప్పాయి లోపలి భాగం ముదురు నారింజ రంగులో ఉండి, ప్రతి భాగం మెత్తగా, రసవంతంగా ఉంటుంది. కానీ రసాయనాలతో శుద్ధి చేసిన బొప్పాయిని కోసినప్పుడు, దాని లోపలి భాగం పాలిపోయి చాలా గట్టిగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ రకమైన బొప్పాయి రుచి చప్పగా, ఏమాత్రం తీపి లేకుండా ఉంటుంది. ప్రకారం కార్బైడ్ నుండి విడుదలయ్యే వాయువు శరీరానికి చాలా ప్రమాదం. ఇది జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. కాబట్టి, కేవలం దాని రూపాన్ని చూసి కాకుండా దాని నాణ్యతను బట్టి సరైన బొప్పాయిని కొనుగోలు చేయండి. తద్వారా మీ కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచుకోండి.

# ఈ సమ్మర్‌లో కూల్‌గా ఉండాలంటే ఇవే బెస్ట్ డ్రింక్స్!



దేశంలో రోజుకు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో పిల్లలు, పెద్దలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే, ఎంత వేడి ఉన్నా, శరీర ఉష్ణాన్ని నియంత్రించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ముఖ్యంగా వేసవి సెలవులలో పిల్లలు మధ్యాహ్న వేళల్లో విశ్రాంతి లేకుండా ఆటల్లో మునిగిపోతుంటారు కాబట్టి, వారిని సరైన విధంగా ప్రోత్సహించి కొంత విశ్రాంతి తీసుకునేలా చూడాలి. వేసవిలో అధిక స్వేదం కారణంగా శరీరంలోని నీటి శాతం వేగంగా తగ్గిపోతుంది. నీరు దాహం తీర్చడానికి అత్యవసరమైనదైనా, తీవ్రమైన ఎండల్లో శరీరాన్ని చల్లగా ఉంచేందుకు సహజమైన, ఆరోగ్యకరమైన పానీయాలు ఎంతో ఉపయుక్తం. వేడి గాలులు, ఉక్కపోత మధ్యాహ్నాలను తట్టుకోవడానికి ఇలాంటి పానీయాలు చల్లదనాన్ని, ఆహ్లాదాన్ని ఇస్తాయి.దక్షిణ భారతదేశంలో వేసవికాలంలో లభించే అనేక సహజ ఆహారాలు, పానీయాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. మన అమ్మమ్మలు, తల్లులు అనాదిగా ఉపయోగిస్తున్న ఈ సంప్రదాయ పానీయాలు శరీరాన్ని చల్లబరచడంలో సహాయపడతాయి. ఇంట్లో సులభంగా తయారు చేసుకునే కొన్ని పానీయాలు, అలాగే ప్రయాణంలో కూడా ఉపయోగపడే కొన్ని పానీయాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

కొబ్బరి నీరు: తాజా కొబ్బరి నీరు వేసవికి అత్యుత్తమ సహజ పానీయం. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు శరీర ఉష్ణాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. సాదాగా లేదా కొద్దిగా పండ్ల రసాలతో కలిపి తీసుకుంటే మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది.

చెరుకు రసం: శతాబ్దాలుగా సహజ ఆరోగ్య పానీయంగా చెరుకు రసం వినియోగంలో ఉంది. ఖనిజాలు, పోషకాలు సమృద్ధిగా ఉండే ఇది శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. నిమ్మరసం లేదా అల్లం కలిపితే రుచి మరింత మెరుగవుతుంది.

పుచ్చకాయ రసం: వేసవిలో అత్యంత ప్రజాదరణ పొందిన పండు పుచ్చకాయ. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేసి తక్షణ తేజస్సును ఇస్తుంది. దాహాన్ని తగ్గించడంలో ఇది చాలా ప్రభావవంతం.

నిమ్మరసం: చల్లని నీటిలో నిమ్మరసం, కొద్దిగా ఉప్పు, పంచదార కలిపి తీసుకుంటే ఇది ఉత్తమ వేసవి పానీయం అవుతుంది. ఇది శరీరాన్ని చల్లగా ఉంచడమే కాకుండా ఉత్సాహాన్ని కూడా పెంచుతుంది.

జల్జీరా: వేయించిన జీలకర్ర పొడి, నల్ల ఉప్పు కలిపి తయారు చేసే ఈ పానీయం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వేసవిలో అలసట తగ్గించడానికి ఇది మంచి ఎంపిక.

కాంజి: నల్ల క్యారెట్ లేదా బీట్‌రూట్‌తో తయారు చేసే ఈ సంప్రదాయ పానీయం ప్రోబయోటిక్ గుణాలతో ప్రసిద్ధి. ఇది జీర్ణ ఆరోగ్యానికి చాలా మంచిది.

జిగర్తాండ: కొన్ని ప్రాంతాల్లో ప్రసిద్ధమైన ఈ తీపి పానీయం పాలు, ఐస్‌క్రీమ్, ఫలూదాతో తయారవుతుంది. వేసవిలో తీపి కోరికను తీర్చే ప్రత్యేక పానీయం ఇది.

నన్నారి షర్బత్: నన్నారి వేర్లతో తయారయ్యే ఈ సిరప్ శరీరాన్ని చల్లబరచడంలో చాలా ప్రభావవంతం. ఐస్‌తో కలిపి తీసుకుంటే మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది.

మజ్జిగ: పెరుగుతో తయారయ్యే మజ్జిగ జీర్ణక్రియకు అత్యంత మంచిది. జీలకర్ర, అల్లం లేదా మిరపకాయలతో కలిపి తీసుకుంటే రుచి, ఆరోగ్యం రెండూ లభిస్తాయి.

రాగి మజ్జిగ: రాగిపిండి కలిపిన మజ్జిగ పోషక విలువలు అధికంగా ఉండే ఆరోగ్యకరమైన పానీయం. ఇది వేసవిలో శక్తిని అందిస్తుంది.

లస్సీ: తీపి లేదా మామిడి రుచిలో లభించే లస్సీ వేసవిలో ఎంతో ఇష్టపడే పానీయం. ఇది శరీరాన్ని చల్లబరచడంలో సహాయపడుతుంది.

థిక్ షేక్: పూర్తిగా పాలు ఆధారంగా తయారయ్యే థిక్ షేక్ ఈ వేసవిలో శక్తినిచ్చే, రుచికరమైన పానీయం. స్నాక్స్‌తో కలిపి తీసుకుంటే మరింత తృప్తికరంగా ఉంటుంది.

ఇలా వేసవిలో సహజమైన, సంప్రదాయ పానీయాలను ఉపయోగించడం ద్వారా శరీరాన్ని చల్లగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# నువ్వు అసలు ప్రొఫెషనల్ క్రికెటర్‌వేనా?..



ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ప్రదర్శన అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఒకప్పుడు తన బౌలింగ్‌తో బ్యాటర్లను వణికించిన బుమ్రా, ఈ సీజన్‌లో మాత్రం పదును పోయిన కత్తిలా కనిపిస్తున్నాడు. లక్నో సూపర్ జెయింట్‌తో జరిగిన తాజా మ్యాచ్‌లో బుమ్రా వేసిన నో బాల్స్ చూసి క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లైవ్ కామెంట్రీలోనే బుమ్రాపై తన కోపాన్ని వెళ్లగక్కారు. లక్నో ఇన్నింగ్స్ 14వ ఓవర్‌లో బుమ్రా వరుసగా రెండు నో-బాల్స్ వేయడం గవాస్కర్‌ను తీవ్ర అసహనానికి గురిచేసింది. "మళ్ళీ మళ్ళీ నాకు చెప్పకండి.. బుమ్రా నో-బాల్ వేశాడంటే నేను నమ్మలేకపోతున్నాను. ఇది అస్సలు ఆమోదయోగ్యం కాదు. నువ్వు ఒక ప్రొఫెషనల్ క్రికెటర్‌వి, ఇలాంటి తప్పులు చేయడం ఏంటి? వైడ్లు వేస్తే అర్థం చేసుకోవచ్చు కానీ, నో-బాల్స్ వేయడం క్షమించరాని నేరం" అంటూ గవాస్కర్ మైక్ ముందే విరుచుకుపడ్డారు.లక్నో బ్యాటర్ హిమ్మత్ సింగ్ 14వ ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. కానీ రీప్లేలో అది నో-బాల్ అని తేలడంతో హిమ్మత్ సింగ్ బతికిపోయాడు. ఆ తర్వాత రెచ్చిపోయిన హిమ్మత్, 40 పరుగులు చేసి లక్నో స్కోరును 220 దాటించాడు. ఈ తప్పిదం మ్యాచ్‌పై ఎంతటి ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు. బుమ్రా నో-బాల్స్ వేస్తున్నప్పుడు కెమెరాలు ముంబై కోచ్ మహేల జయవర్ధనే, బౌలింగ్ కోచ్ లసిత్ మలింగ వైపు మళ్లగా, వారి ముఖాల్లో నిరాశ స్పష్టంగా కనిపించింది. బౌలింగ్ కోచ్ గారూ.. ఇది చాలా పెద్ద తప్పు అంటూ మలింగను ఉద్దేశించి గవాస్కర్ వ్యాఖ్యానించారు.

బుమ్రాకు ఈ 2026 ఐపీఎల్ సీజన్ ఒక పీడకలలా మారింది. ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన ఆయన కేవలం 3 వికెట్లు మాత్రమే తీశాడు. లక్నోతో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసి 45 పరుగులు సమర్పించుకుని ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. గత రెండు నెలల క్రితం వరకు అద్భుత ఫామ్‌లో ఉన్న బుమ్రా, ఈ సీజన్‌లో ఇన్ని నో-బాల్స్ (మొత్తం 8) వేయడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. ముంబై ఇండియన్స్ సీజన్ ఎలా సాగుతుందో బుమ్రా బౌలింగ్ చూస్తే అర్థమైపోతోందని మాజీ క్రికెటర్ దీప్ దాస్‌గుప్తా కూడా ఎద్దేవా చేశారు.టాస్ గెలిచిన ముంబై మొదట బౌలింగ్ ఎంచుకోగా, లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోరు సాధించింది. నికోలస్ పూరన్ (63), మిచెల్ మార్ష్ (44) మెరుపులు మెరిపించారు. అయితే, ముంబై బ్యాటర్లు ఏమాత్రం తగ్గకుండా ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించారు. రోహిత్ శర్మ (84), ర్యాన్ రికెల్టన్ (83) అద్భుత ఇన్నింగ్స్ ఆడటంతో ముంబై మరో 10 బంతులు మిగిలి ఉండగానే 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ గెలిచినప్పటికీ, బుమ్రా ఫామ్ మాత్రం ముంబై యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:1-94 nekunampuram,pokur,Prakasam,andhrapradesh 523113Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2843. Ph:9849707349 . email:kvp6858@gmail.com.

జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.

APTEL/25/A2844

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

క్రిష్ణా సంపుటి : 02 సంచిక : 162 బుధవారం 06- 05 - 2026 పేజీలు : 4 వెల. 2

రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు
కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
98497 07349

## నివాసాల మధ్య బెల్ట్ షాపులు తొలగించండి.!

### ప్రజా దర్బార్ లో ఎం ఎల్ ఏ కు ఫిర్యాదు చేసిన మహిళా



**ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం,మే 5(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు, ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా దర్బార్ లో మండల పరిధిలో గల పలు సమస్యలపై ఫిర్యాదుల శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సేకరించారు. ఈ సందర్భంగా ప్రజలకు సంబంధించిన ప్రతి ఒక్క సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో జననివాసాల మధ్య అనుమతులు లేకుండా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని అక్కడికి వచ్చే మందు బాబులు అసభ్యమైన పదజాలంతో అటువైపు వెళ్లే పాదచారులపై ముఖ్యంగా మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఎం ఎల్ ఏ కు మహిళ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం ఆ ఫిర్యాదును సిఫార్సు చేసి తక్షణమే బెల్ట్ షాపులు తొలగించాలని శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల రామ్మోహన్ రావు( గాంధీ),ఇబ్రహీంపట్నం మండల తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో,కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టి బాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్ ,కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు సచివాలయాల సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల మనస్సులు గెలవండి..

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** : ప్రజల మనసులు గెలవండి.. మళ్లీ, మళ్లీ మనల్ని గెలిపిస్తారని తెలుగు దేశం పార్టీ క్లస్టర్లు, ఇన్‌చార్జిలకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలో వారితో కాఫీ కబుర్లు పేరుతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కేడర్‌దేనని వెల్లడించారు. పనిచేయని వారి పదవులు ఊడతాయని పార్టీ అధినేత హెచ్చరించారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరమని ఆయన కుండ బద్దలు కొట్టారు.మనం చేసిన అభివృద్ధి – సంక్షేమం ప్రజలకు వివరించాలని దిశా నిర్దేశం చేశారు. అహంకారం వీడి సత్ప్రవర్తన, మంచి మాటలతో ప్రజల మనస్సులు గెలవాలంటూ వారికి సూచించారు. తెలుగుదేశం పార్టీ లీడర్లు, కేడర్ సమన్వయం చేసుకుంటూ అనునిత్యం ప్రజలతో మమేకం కావడం ముఖ్యమని వారికి మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో గొడ్డలి పార్టీ 151 నుంచి 11సీట్లకు దిగజారడానికి వారి అహంకారమే కారణమని వైసీపీని ఉద్దేశించి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు.



## భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా జలధార - జలహారతి: మంత్రి బీసీ జనార్ధన్



**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** రాష్ట్రంలో భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సూచనల మేరకు జలధార – జల హారతి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకొని పనిచేస్తోందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. హనుమంత గుండం చెరువు నుంచి దాదాపు 23 కిలోమీటర్లు కాలువ పొడవున ఉన్న 5 చెరువుల్లో, వాగులు, వంకల్లో మట్టి పూడికతీత పనులను సొంత నిధులతో చేపట్టామని అన్నారు. 3 మీటర్లలోపు భూగర్భ జలాలు వచ్చేలా కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు.భూగర్భ జలాలు పెరిగితే రైతులంతా తమ బోర్ల ద్వారా పంటలను సాగు చేసుకునే వీలుంటుందని బీసీ జనార్ధన్ వెల్లడించారు. 23 కిలోమీటర్ల కాల్వ పొడవున జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు ఐదు చెరువుల్లో మట్టి పూడికతీత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చెరువులు, కాలువల్లో పూడికతీత కార్యక్రమంలో భాగంగా మట్టిని.. అవసరమైన రైతులు తీసుకువెళ్లే విధంగా వెసులుబాటు కల్పించనున్నట్లు చెప్పారు. మట్టిని తీసుకెళ్లే రైతులను ఇబ్బంది పెట్టకుండా అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం జలహారతి – జలధార కార్యక్రమాన్ని ఒక యజ్ఞం మాదిరిగా చేస్తోందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

## బెంగాల్ ప్రజల తీర్పుపై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు: పీవీఎన్ మాధవ్



**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపొందడంతో విజయవాడలో ఆ పార్టీ నేతలు విజయోత్సవర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో భవానీపురంలోని సుజనా చౌదరి కార్యాలయం నుంచి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. ప్రజలు బీజేపీపై ఉన్న నమ్మకంతో మూడు రాష్ట్రాల్లో పట్టం కట్టారని అన్నారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ 'రౌడీ పరిపాలన'కు ప్రజలు అంతం పలికారని, బెంగాల్ ప్రజలు ఇచ్చిన తీర్పుపై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.బీజేపీ వ్యవస్థాపకులు డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పుట్టిన గడ్డపై ఒకప్పుడు జనసంఘ్ కేవలం ఒక్క సీటుతో ప్రస్థానాన్ని ప్రారంభించిందని మాధవ్ గుర్తుచేశారు. అక్కడ బీజేపీ సాధించిన విజయం చరిత్రాత్మకమని చెప్పుకొచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోని దాదాపు 20 రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలు ఏర్పడటం దేశాభివృద్ధికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలో అస్సాం, పాండిచ్చేరిలో అద్భుత విజయాలను సాధించామని మాధవ్ చెప్పారు. బీజేపీకి మైనారిటీలు ఓటు వేయరనే అపోహను తొలగిస్తూ, 60 శాతం ముస్లిం జనాభా ఉన్న ప్రాంతాల్లో 63 స్థానాలకు గాను 40 స్థానాలు గెల్చుకోవడం విశేషమని పేర్కొన్నారు. తమిళనాడులో సూపర్ స్టార్ విజయ్ సాధించిన విజయాన్ని బీజేపీ స్వాగతించిందని తెలిపారు. అమిత్ షా, సునీల్ బన్సల్ వంటి నాయకుల కృషి, కార్యకర్తల త్యాగాల వల్లే ఈ విజయం సాధ్యమైందని పీవీఎన్ మాధవ్ వెల్లడించారు. విజయోత్సవ ర్యాలీలో పెద్దఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్ హయాంలో గుంటూరు ఛానల్ పనులను పట్టించుకోలేదు.. పెమ్మసాని ధ్వజం



**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** ప్రత్తిపాడు ప్రాంతానికి గుంటూరు ఛానల్ చాలా ముఖ్యమైనదని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. గుంటూరు ఛానల్లో ఫ్లో లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. గుంటూరు ఛానల్లో గుర్రపు డెక్క పేరుకుపోతుందని చెప్పుకొచ్చారు. ఈరోజు (మంగళవారం) ప్రత్తిపాడు నియోజకవర్గంలో గుంటూరు ఛానల్‌ను పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణతో పాటు పొడిగింపు చేస్తున్నామని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వంలో గుంటూరు ఛానల్ పనులను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఈ ఛానల్ పనులను ముందుకు తీసుకెళ్లలేదని.. నిర్లక్ష్యంగా వదిలేశారని ఆగ్రహించారు. తమ ప్రభుత్వంలో ఈ ఛానల్‌ను 47 నుంచి 74 కిలోమీటర్ల వరకు పొడిగిస్తున్నామని తెలిపారు. రూ.70 కోట్లు ఈ ఛానల్ పొడిగింపునకు అవసరమైన భూమిని కేటాయించామని వివరించారు. 75 వేల ఎకరాల సాగు, యాభై గ్రామాలకు తాగునీరు అందుతాయని వెల్లడించారు. ఆధునికీకరణ కోసం రూ.369 కోట్లతో ప్రస్తుతం పరిపాలనపరమైన అనుమతి ఇచ్చామని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

వైసీపీ హయాంలో రైతులను ఇబ్బంది పెట్టారు: బూర్ల రామాంజనేయులు

వైసీపీ హయాంలో రైతులను ఇబ్బంది పెట్టారని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను సీఎం చంద్రబాబు ఆదుకుంటున్నారని తెలిపారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, పొడిగిస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారని ప్రస్తావించారు. టీడీపీ హయాంలో గతంలో ఇచ్చిన గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, పొడగింపును వైసీపీ హయాంలో రద్దు చేశారని బూర్ల రామాంజనేయులు ధ్వజమెత్తారు.

## ఎవరబ్బ సొత్తని పాసుపుస్తకాలపై జగన్‌రెడ్డి తన ఫొటో వేయించుకున్నాడు..



**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** వైసీపీ పాలనలో భూముల విషయంలో రైతులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఎవరబ్బ సొత్తని రైతుల పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్‌రెడ్డి తన ఫొటో వేయించుకున్నాడని మండిపడ్డారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మీ భూమి–మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను సోమవారం ఆమె పంపిణీ చేశారు. చెన్నేకొత్తపల్లి పంచాయతీలో 11006, వెల్దురి 394, బ్రాహ్మణపల్లి 82 మంది పాసుపుస్తకాలు రాగా వాటిని రైతులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు.

కుట్టుమిషన్లు, సెల్‌ఫోన్ల పంపిణీ

వెలుగు ఆధ్వర్యంలో ఇన్‌ఫిన్స్ చారిటబుల్ ఫౌండేషన్ సాహకారంతో 50 శాతం సబ్సిడీపై ఏర్పాటు చేసిన 500 కుట్టు మిషన్లను ఎమ్మెల్యే పరిటాల సునీత లబ్ధిదారులైన మహిళలకు అందజేశారు. అలాగే చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల 80 మంది ఐకేపీ యానిమేటర్లకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇన్‌ఫిన్స్ సంస్థ రాప్తాడు నియోజకవర్గంలో 8వేల మంది మహిళలకు 50శాతం సబ్సిడీతో కుట్టుమిషన్లను అందజేస్తోందన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 50 శాతం సబ్సిడీతో సైకిళ్లను పంపిణీ చేయడానికి కూడా ఈ సంస్థ ముందుకు వచ్చిందన్నారు.

అనంతరం మండలంలో ఐదుగురికి మంజూరైన రూ.2.90లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం సత్యనారాయణ, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో బాలకృష్ణుడు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ సుధాకర్‌నాయుడు, సొసైటీ అధ్యక్షుడు నరసింహులు, గ్రామ స్వరాజ్ ఎండీ శైలేంద్ర, ఏపీఎం నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి రంగయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బమ్మ, సీకేపల్లి, కనగానపల్లి మండల కన్వీనర్‌లు ముత్యాల్‌రెడ్డి, యాతం పోతలయ్య, దండు ఓబులేసు పాల్గొన్నారు.

## ఆకివీడు రామాలయంపై హైకోర్టులో పిటిషన్

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు నగర పంచాయితీ పరిధిలోని పెదపేటలో రామాలయం నిర్మాణానికి అధికారులు అనుమతులు మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పెదపేటకు చెందిన వంగా జ్యోత్స్న మరో దీనిని దాఖలు చేశారు. ప్రభుత్వ భూమిలో మతపరమైన నిర్మాణం జరపడం సుప్రీం కోర్టు తీర్పుకి విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. హడావుడిగా రామాలయం నిర్మాణం జరుపుతున్నారని, అనుమతులు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సోమవారం పిటిషనర్ల తరఫు న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్... వ్యాజ్యాన్ని లంచ్ మోషన్‌గా స్వీకరించి విచారణ జరపాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్‌ను అభ్యర్థించారు. మంగళవారం విచారణ జరుపుతామని న్యాయమూర్తి స్పష్టం చేశారు.



# స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా చెత్త సేకరణ 3చక్రాల రిక్షాలను అందించిన కామినేని



**ఏలూరు జిల్లా ముదినేపల్లి::::క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి::::** స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా చెత్త సేకరణ 3చక్రాల రిక్షాలను అందించిన కామినేని స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా ముదినేపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు ప్రభుత్వం మంజూరు చేసిన చెత్త సేకరణ 3చక్రాల రిక్షాలను మండలం లోని 32 గ్రామాల గ్రీన్ అంబాసిడర్ లకు,32 గ్రామాలకు పంపిణీ కార్యక్రమం లో ఏం.ఎల్.ఏ.కామినేని పాల్గొని గ్రీన్ అంబాసిడర్ లతో కలసి రిబ్బన్ కట్ చేసి చెత్త సేకరణ రిక్షాలుని అందించారు కామినేని మాట్లాడుతూ

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏంతో ప్రతిష్టాత్మకంగా దేశంలోని ప్రతి ఒక్కరి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని,ఉంచుకోవాలని,ప్రజా ఆరోగ్య భద్రత దృష్ట్యా స్వచ్ఛభారత్ పధకంలో భాగంగా తడి,పొడి చెత్తలను విడివిడిగాను,ప్లాస్టిక్ మరియు మందుల వ్యర్ధాలను విడివిడిగా సేకరించి పర్యావరణ పరిరక్షణకొసము,ప్రజా ఆరోగ్యగా చూసుకోవాలని,ప్రజలందరూ ఆరోగ్యం ఉండాలనే సంకల్పంతో పధకాన్ని ప్రారంభించి,గ్రామ పంచాయితీ కార్యాలయాల ద్వారా ప్రతి 250మంది జనాభా కలిగి వార్డుల వారిగా ప్రతి ఇంటికి గ్రీన్ అంబాసిడర్ ల ద్వారా చెత్తలను సేకరణ చేసి, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి,కుత్రిమ ఎరువులను తయారు చేసి ఆహార ధాన్యానికి వాడి అధిక దిగుబడులు రైతులు పొందుటకు చెత్త సేకరణ కేంద్రాల ద్వారా తయారు చేస్తున్నారని, ప్రజలందరూ తమ,తమ భాద్యత గా గ్రామ గ్రీన్ అంబాసిడర్ లకు చెత్తని స్వచ్ఛందంగా అందించాలానికోరారు.ఈ కార్యక్రమంలో ఏం.పీ.డీ.ఓ. రామకృష్ణ, ఈ.వో.పీ.ఆర్డీ. అశోక్, ఎమ్మార్వో లతీఫ్ ఫాష,మండలం లోని పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, ఎన్డీఏ కుటమి నాయకులైన తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి వీరమల్లు నరసింహారావు,రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ కొడాలి వినోద్,శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బొంగు రవి,నాగరాజు,బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కోటపోలు కృష్ణ, పైడిపాటి శివశంకర్, సత్య వోలు నాగలక్ష్మి, జనసేన నాయకులు వీరంకి వెంకయ్య, ఏ.ఎన్. బాబు,మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కూటమి నాయకులు మరియు గ్రీన్ అంబాసిడర్స్ పాల్గొన్నారు

# ఏపీ పాలిసెట్ ఫలితాలు విడుదల

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు ఈరోజు (మంగళవారం) విడుదలయ్యాయి. ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ ఫలితాలను ప్రకటించారు. ఈసారి పరీక్షల్లో రికార్డు స్థాయిలో విద్యార్థులు పాల్గొనగా, మొత్తం ఉత్తీర్ణత శాతం 91.37 శాతంగా నమోదైంది.

రికార్డు స్థాయిలో విద్యార్థుల హాజరు..

ఈ సంవత్సరం ఏపీ పాలిసెట్ కోసం మొత్తం 1,77,581 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. వీరిలో 1,63,008 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రాసిన వారిలో 1,48,950 మంది విద్యార్థులు అర్హత సాధించడం విశేషం. ఈ ఫలితాలు రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

91.37శాతం ఉత్తీర్ణత..


ఈసారి మొత్తం 91.37శాతం ఉత్తీర్ణతగా నమోదైంది. గత సంవత్సరాలతో పోలిస్తే ఇది మంచి ఫలితంగా అధికారులు భావిస్తున్నారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఈ ఫలితాలకు కారణమని అభిప్రాయపడ్డారు.

ముందంజలో బాలికలు..

ఈసారి ఫలితాల్లో బాలికలు బాలుర కంటే మెరుగైన ప్రదర్శన కనపరిచారు. బాలికల ఉత్తీర్ణత శాతం 93.57శాతంగా నమోదైంది. ఇది మహిళా సాధికారత దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు నిదర్శనంగా అధికారులు భావిస్తున్నారు.

జిల్లాల వారీగా ఉత్తమ ఫలితాలు..

గిరిజన ప్రాంతాల విద్యార్థులు కూడా ఈసారి అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. అల్లూరి సీతారామరాజు జిల్లా -- 99.11శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానం, పోలవరం జిల్లా 95.46శాతం ఉత్తీర్ణత, పార్వతీపురం మన్యం జిల్లా 93.45శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఫలితాలు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధి పెరుగుతున్నదానికి సూచనగా నిలుస్తున్నాని అధికారులు తెలిపారు.




మంత్రి నారా లోకేశ్ అభినందనలు

విద్యలో బాలికల ప్రతిభ రాష్ట్ర అభివృద్ధికి కీలకమని మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఈ ఫలితాలను ప్రకటించిన మంత్రి లోకేశ్ విద్యార్థులను అభినందించారు. కష్టపడి చదివిన ప్రతి విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర విద్యావ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఏపీ పాలిసెట్ ఫలితాలు రాష్ట్రంలో సాంకేతిక విద్యకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని చూపిస్తున్నాయని తెలిపారు. 90 శాతానికి పైగా ఉత్తీర్ణత, బాలికల అద్భుత ప్రదర్శన, గిరిజన జిల్లాల రికార్డు ఫలితాలు ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో ఫలితాలు అందుబాటులో

ఏపీ పాలిసెట్ ఫలితాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. ప్రభుత్వం ప్రారంభించిన మన మిత్ర వాట్సాప్ సేవల ద్వారా కూడా ఫలితాలను పొందవచ్చు. ఈ అవకాశం విద్యార్థులకు మరింతగా ఉపయోగపడనుంది.

# అంబులెన్స్ డ్రైవర్ నిద్రమత్తుకు నలుగురి ప్రాణాలు బలి




**ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ**

**తిరుపతి జిల్లా ఊరందూరులో ప్రమాదం**

**మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**

**అందరూ పశ్చిమబెంగాల్ వాసులు**

**చికిత్స కోసం బెంగళూరు వెళ్తుండగా ఘటన**

**మృతుల్లో ముగ్గురిది ఒకే కుటుంబం**

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** అంబులెన్స్ డ్రైవర్ నిద్రమత్తు నలుగురి ప్రాణాలను బలిగొంది. మరో ఇద్దరిని తీవ్ర గాయాలపాలు చేసింది. ఉబ్బసం రోగిని ఎలాగైనా బతికించుకోవాలని అంబులెన్స్‌లో పశ్చిమబెంగాల్ నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరుకు బయలుదేరిందా కుటుంబం. అయితే, ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అంబులెన్స్ ఢీకొనడంతో రోగి సహా ముగ్గురు కుటుంబసభ్యులు, అంబులెన్స్ కో-డ్రైవర్ కూడా మృతి చెందారు. డ్రైవర్ సహా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిందీ ఘటన. పోలీసుల కథనం మేరకు పశ్చిమబెంగాల్ రాష్ట్రం హుగ్లీ ప్రాంతానికి చెందిన బ్రజా దోలుయి(48) తీవ్ర ఆస్తమా వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. స్థానిక వైద్యుల సలహా మేరకు ఆయనను బెంగళూరులోని ప్రముఖ ఆస్తమా వైద్యశాలకు తరలించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేశారు. బ్రజా దోలుయితోపాటు భార్య టగారి(35), అన్న జతిన్(63), టగారి స్నేహితురాలు థగోడిస్ శనివారం రాత్రి 10.30 గంటలకు హుగ్లీ నుంచి అంబులెన్స్‌లో బెంగళూరుకు బయలుదేరారు. డ్రైవర్ రాకేశ్ పండిత్(29) అంబులెన్స్‌ను నడుపుతుండగా, అతని సోదరుడైన కో-డ్రైవర్ రితేశ్ పండిత్(24) కూడా ఇదే వాహనంలో ఉన్నారు. డ్రైవర్ రాకేశ్ నిద్రమత్తులో ఊరందూరు వద్ద రేణిగుంట-నాయుడుపేట జాతీయరహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో బ్రజా దోలుయి, టగారి, జతిన్, రితేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రాకేశ్, థగోడి?సలను పోలీసులు చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. మృతుల బంధువులకు సమాచారం అందించి, దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రాణం మీదకు తెచ్చిన సోషల్ మీడియా వంటకం

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** సోషల్ మీడియాలో వచ్చిన ఒక వంటకం ఒక కుటుంబం ప్రాణాల మీదకు తెచ్చింది. మిగిలిన ఆకు కూరల్లానే ఉమ్మెత్త పువ్వుతో కూర వండుకుని తింటే ఆరోగ్య మని ఇటీవల సోషల్ మీడియాలో ఒక వంటకం గురించి వీడియో వైరల్ అయ్యింది. ఆ వీడియోను కాకినాడ జిల్లా గండేపల్లి మండలం ఎర్రంపాలెం గ్రామానికి చెందిన బిక్కిన గంగాభవాని కుటుంబీకులు చూశారు. అదే రీతిలో సోమవారం ఉమ్మెత్త పువ్వును పప్పులో వేసుకుని కూర వండుకున్నారు. అనంతరం భోజనంలో కలుపుకొని బిక్కిన గంగాభవాని, ముత్యాల వీరలక్ష్మి, బిక్కిన వీరబ్బు, రిమ్మలపూడి జయలక్ష్మి తిన్నారు. ఆ కూర తిన్న కాసేపటికే కుటుంబీకులంతా అస్వస్థతకు గురయ్యారు. నలుగురూ తీవ్ర అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో స్థానికులు వెంటనే గమనించి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రాణాపాయం నుంచి బయట పడినట్టు చికిత్స అందించిన వైద్యులు తెలిపారు. ఉమ్మెత్త పువ్వు సహజంగానే తీవ్రమైన విషపూరిత గుణాలు కలిగి ఉంటుందని, దీనికి ప్రత్యేకమైన విరుగుడు ఉండదని, శరీరంలో విష ప్రభావం పెరిగితే ప్రాణాపాయం తప్పదని వైద్యులు తెలిపారు.



ఈనెల 1న మహిళను తీసుకెళ్లిన ఆటో

# హిందూపురంలో.. ఎందుకిలా జరుగుతోంది?

**హెచ్చుమీరుతున్న దారుణాలు**

**వరుసగా హత్యలు, దోపిడీలు, కిడ్నాప్‌లు**

**భయాందోళన చెందుతున్న ప్రజలు**

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ఇటీవల నాలుగు హత్యలు జరిగాయి. ఇందులో ఒకటి, రెండు హత్యలు చిన్నపాటి ఘర్షణకే జరిగాయి.నాలుగు రోజుల క్రితం ఆటోలో ఎక్కిన ఓ మహిళనుంచి పట్టణ పరిధి దాటాక నగలు, నగదు దోచుకున్న ఘటన చోటుచేసుకుంది. వెంటనే పోలీసులు అప్రమత్తమై స్పందించడంతో సొమ్మును రికవరీ చేయగలిగారు. తాజాగా ఆదివారం రాత్రి ఇంటి ముందు ఆడుకుంటున్న ఆరేళ్ల చిన్నారిని ఓ వ్యక్తి చాక్లెట్ ఇచ్చి బైక్‌పై తీసుకెళ్లాడు. అయితే ముళ్లపొదలవైపు తీసుకెళ్తున్న సమయంలో చిన్నారి కేకలు వేయడంతో అక్కడున్నవారు గమనించి వెంటనే రక్షించారు.

గత వైసీపీ హయాంలో హిందూపురం నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటికి అడ్డుకట్ట పడింది. అయితే ఏమైందో ఏమో ఇల్లీ కొద్దికాలంగా ఇలాంటి దారుణాలు అధికమవుతున్నాయి. హిందూపురం సబ్‌డివిజన్‌లో కొంతమంది అసాంఘిక శక్తులు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇందుకు నిదర్శనం ఇటీవల జరిగిన దారుణాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. జిల్లా ఎస్పీ హిందూపురంపై ఎంత ఫోకస్ పెట్టినా కొన్ని అసాంఘిక కార్యకలాపాలు ఆగడం లేదన్నది నగ్నసత్యంగా నిలుస్తోంది. అయితే ఎందుకిలా జరుగుతుందన్నది పోలీసులకే ఎరుక.

హెచ్చుమీరుతున్న అసాంఘిక శక్తులు

ఓ వైపు పోలీసులు జరిగిన నేరాలపై ఎప్పటికప్పుడు స్పందించి నేరస్తులను పట్టుకుంటున్నారు. అయినా వారంలో ఏదోఒక నేరం జరగడం ఆనవాయితీగా మారిందన్న ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. దీనికితోడు అన్ని పోలీస్?స్టేషన్లకు కొత్త సిబ్బంది వచ్చారు. వారు పట్టణంపై పట్టు సాధించాలంటే మరికొన్నిరోజులు పడుతుంది. పేకాట, మట్కా, పట్టణంలో విపరీతంగా జరుగుతున్నది. పోలీసులు వాటి నిర్వాహకులను పట్టుకుని గుట్టుచప్పుడు కాకుండా కోర్టులో హాజరుపరుస్తున్నారు. దీనివల్ల పోలీసులు ఇంతకన్నా ఏమీ చేయలేరులే అన్న ధైర్యంతో అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నారు. వీరితోపాటు ఇతర ప్రాంతానికి చెందిన వారు వచ్చి అసాంఘిక కార్యకలాపాల్లో పాలు పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. తరచూ కారిడాన్ సర్చ్ పేరుతో తనిఖీలు చేస్తున్నా కొంతమంది నేరస్థులు అసాంఘిక కార్యకలాపాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు.

జనం బెంబేలు

ఇటీవల హిందూపురం ప్రాంతంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మహిళలు బయటికి వెళ్తే ఎక్కడ ఆభరణాలు దోచుకెళ్తారోనన్న భయం. చిన్న పిల్లలను బయటకు పంపాలంటే జంకే పరిస్థితి. మరోవైపు నగలు, నగదు వేసుకుని వెళ్లాలంటే ఎక్కడ దోపిడీ జరుగుతుందోనన్న బెంగ పట్టుకుంటోంది. ఏదిఏమైనా అసాంఘిక శక్తులను కూకటేళ్లతో పెకలించి జరుగుతున్న నేరాలకు చెక్ పెడితేతప్ప ప్రజల్లో భయాందోళన తగ్గదన్నది నగ్నసత్యం.

# చిరుద్యోగికి పెద్ద బాధ్యతలు

**జూనియర్ అనలిస్ట్ చేతికి డ్రగ్ విభాగం**

**జీఎం, ఫార్మసిస్టు, సూపరింటెండెంటు... అన్నీ అతనే**

**మెడికల్ కార్పొరేషన్‌లో మరొక వివాదాస్పద ఉత్తర్వు**

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎంఎస్ఐడీసీ) అడ్డగోలు నిర్ణయాలకు చిరునామాగా మారుతోంది. కార్పొరేషన్‌లో డ్రగ్స్ జనరల్ మేనేజర్ పోస్టు చాలా కీలకం. ఇలాంటి కీలకమైన డ్రగ్స్ విభాగానికి రెండు వారాల క్రితం జనరల్ మేనేజర్‌గా ఒక జూనియర్ అనలిస్ట్‌ను నియమించారు. నిబంధనల ప్రకారం ఔష?ధ నియంత్రణ మండలిలో అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులను ఈ పోస్టుల్లో నియమించాలి. కానీ ఒక జూనియర్ అనలిస్ట్‌కు కార్పొరేషన్‌లో డ్రగ్ జీఎం బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాక.. డ్రగ్స్ విభాగంలో ఆర్థిక వ్యవహారాలు నిర్వహించే సూపరింటెండెంట్ పోస్టుకు సంబంధించిన అదనపు బాధ్యతలు కూడా సదరు ఉద్యోగికే కట్టబెట్టారు. దీనికోసం డ్రగ్స్ విభాగంలో రూ.కోట్ల బిల్లులు మొత్తం చిరుద్యోగి కనుసన్నల్లో నడిచే వి?ధంగా నిబంధనలనూ మార్చారు. ఈ నిర్ణయం మరిన్ని విమర్శలకు దారితీసింది. ల్యాబ్‌లో పరీక్షలు చేయాల్సిన చిన్న ఉద్యోగి, ఏపీఎంఎస్ఐడీసీలో ఫార్మసిస్టుగా, డ్రగ్స్ విభాగం జనరల్ మేనేజర్‌గా, ఇప్పుడు ఆర్థిక వ్యవహారాలు చూసే సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా ఆరోగ్య శాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్ ఏపీఎంఎస్ఐడీసీ ఎండీగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# బియ్యం..కయ్యం.. రేషన్ డీలర్లు వర్సెస్ సీఎస్ డీటీలు



**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** గుంటూరు: గుంటూరు నగరంలో ఈ నెల ప్రారంభం నుంచి రేషన్ డీలర్లు, పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు(సీఎస్ డీటీలు) మధ్యన వార్ నడుస్తోంది. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల పేరుతో డీటీలు కొన్ని రేషన్ షాపుల్లో తనిఖీలు చేస్తున్నారు. స్టాకు హెచ్చు తగ్గుల నేపథ్యంలో.. డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసి, షాపు సీజ్ చేస్తున్నారు. దీనిని డీలర్లు తీవ్రంగా ఖండిస్తున్నారు. స్టాకు సక్రమం గానే ఉన్నా.. డీటీలే ఆటోలో బియ్యం బస్తాలు తీసుకొచ్చి అన్ లోడింగ్ చేసి.. స్టాకు అదనంగా ఉందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని గళం విప్పుతున్నారు.ఈ వ్యవహారం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో పరస్పర ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. మే నెల రేషన్ పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. కొంతమంది డీలర్లు నేరుగా కార్డుదారులకు కేజీ బియ్యానికి రూ.14 నుంచి రూ. 15 వరకు చెల్లించి ఆ స్టాకుని రేషన్ మాఫియాకి చేర్చి లబ్ధి పొందుతున్నారు. కొంతమంది డీలర్లు.. పలుకుబడితో రేషన్ షాపు మంజూరు చేయించుకుని ఇతర డీలర్లకు సబ్ లీజుకు ఇచ్చేశారు. డీలర్లు, సీఎస్ డీటీలు మధ్య ఒప్పందం కుదిరితే ఎలాంటి సమస్య తలెత్తడం లేదు. ఎప్పుడైతే ఇరువర్గాల మధ్యన భేదాలు తలెత్తుతాయో అప్పుడు పరస్పర చర్యలకు ఉపక్రమిస్తున్నారు. జిల్లాలో 972 షాపులు ఉంటే యాక్టివ్‌లో 928 మాత్రమే ఉన్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకొంటే 34 షాపులను అధికారలు సీజ్ చేసినట్లు స్పష్టమవుతోంది.

# ఉన్నత విద్యా కమిషనరేట్‌కు అడ్మిషన్ల అధికారాలు



**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** ఉన్నత విద్యాశాఖను పునర్ వ్యవస్థీకరించి ఉన్నత విద్య కమిషనరేట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం అందుకనుగుణంగా కమిషనరేట్‌కు పలు అధికారాలు అప్పగించింది. ప్రస్తుతం ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యాశాఖల వద్ద ఉన్న అడ్మిషన్లు, అనుమతుల అధికారాలను కమిషనరేట్‌కు అప్పగించింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం అధికారాల బదిలాయింపుపై 18 వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై అన్ని ఉన్నత విద్యా కోర్సుల, డిప్లొమా కోర్సుల అడ్మిషన్లను ఉన్నత విద్యా కమిషనరేటే చేపడుతుంది. అలాగే డిగ్రీ, లా, ఇతర కోర్సులు అందించే కొత్త కాలేజీల ఏర్పాటుకు అనుమతులను ఈ కమిషనరేటే జారీ చేస్తుంది. బీఈడీ అడ్మిషన్లు కూడా కమిషరేట్ నుంచే జరుగుతాయి. అయితే, ప్రవేశ పరీక్ష నిర్వహణ మాత్రం ఉన్నత విద్యామండలి పరిధిలోనే ఉంటుంది. మండలి ప్రవేశ పరీక్షలను నిర్వహించాక అడ్మిషన్లను కమిషనరేట్ చేపడుతుంది.

# మామిడి నాణ్యత లేకే ధర తగ్గి ఉండొచ్చు: ఉద్యాన శాఖ



**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** నాణ్యత తగ్గడం వల్లే మామిడి ధరలు తగ్గి ఉండొచ్చని ఉద్యాన శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మామిడి ధర ఢమాల్ – రైతులు కుదేల్' శీర్షికన ఈ నెల 4న ప్రచురితమైన కథనానికి ఉద్యాన శాఖ అధికారులు వివరణ ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో 22,896 హెక్టార్లలో రైతులు మామిడి సాగు చేశారని, నల్లి తామర ఉధృతి వల్ల తోటల్లో పూత దెబ్బతిన్నదని, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల 20–25 శాతం దిగుబడులు తగ్గాయన్నారు. కోతల తొలి రోజుల్లో కాయలకు మంచి రేటు వచ్చిందని, రైతులకు నష్టాలు రాలేదన్నారు. తోతాపురి రకానికి మసి, రాతి మంగు ఎక్కువ ఉండటం వల్ల మార్కెట్లో ధరలు తక్కువగా ఉన్నాయన్నారు. ఇతర రాష్ట్రాల్లోని మామిడి మార్కెట్లలోకి తెలంగాణ, రాయలసీమ మామిడి కాయలు రావడం వల్ల.. ఎన్టీఆర్ జిల్లాలో మామిడి ధరలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు.



# దుర్గమ్మ భూములు దోచేశారు!

**తాడికొండ మండలం పాములపాడులో విలువైన 70 సెంట్లు**
**మరో 235 చదరపు గజాలు కూడా హాంఫట్**
**రికార్డుల పరిశీలనలో గుర్తించిన దుర్గగుడి ఈవో**
**భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు**

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** అమరావతి మండలం ధరణికోట గ్రామానికి చెందిన బొందలపాటి రాజమ్మ 2004, ఆగస్టు 23న తనకున్న స్థిరాస్తుల్లో కొంత భూమిని పలు దేవాలయాలకు విరాళంగా ఇచ్చారు. తాడికొండ మండలం పాములపాడు గ్రామంలోని సర్వే నెంబరు 433లో మొత్తం 10 ఎకరాల 30 సెంట్లు ఉండగా, అందులో 64 సెంట్లు, సర్వే నెంబరు 432లో మరో ఆరు సెంట్ల మెరక భూమిని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని కనకదుర్గమ్మకు పసుపు, కుంకుమ కింద విరాళంగా ఇచ్చారు.అదే గ్రామంలో గ్రామ కంఠానికి చెందిన 235 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని బండి బాటతో సహా కనకదుర్గమ్మ గుడికి చెందేలా వీలు నామా రాశారు. ఈ రెండు భూముల ను 2013 డిసెంబరు 1న గుంటూరులో రిజిస్ట్రేషన్ చేయించారు. దుర్గ గుడితో పాటు పల్నాడు జిల్లాలోని అమరేశ్వరస్వామి ఆలయం, కడప జిల్లాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి, పెనుగంచి ప్రోలు లోని తిరుపతమ్మ అమ్మవారి దేవస్థా నానికి, శ్రీశైలంలోని శ్రీమల్లికార్జున స్వామి దేవస్థానానికి, భద్రాచలం లోని భద్రాద్రి దేవస్థానానికి తనకున్న స్థిరాస్తులను విరాళాలుగా రాసి గుంటూరులో రిజిస్ట్రేషన్ చేయించారు.

దుర్గగుడి భూములు కబ్జా

దుర్గగుడికి ఇచ్చిన పాముల పాడులోని 70 సెంట్ల భూమిని కొందరు స్థానికులు కబ్జా చేశారు. 235 చదరపు గజాల స్థలాన్ని దాత రాజ మ్మ బంధువులు ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టారు. దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూముల రికార్డులను ఈవో శీనానాయక్ పరిశీలిస్తుండగా, పాములపాడులో ఈ భూములు ఉన్నట్టు గుర్తించారు. ఆలయ అధికారులను వివరాలు అడిగి తెలుసుకోగా, భూములను స్థానికం గా కొందరు ఆక్రమించుకున్నారని వెల్లడించారు.కబ్జాకు గురైన 70 సెంట్ల భూమిలో దేవస్థానం పేరిట హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, ఆ బోర్డును తొలగించారని వివరించారు. దీనిపై స్పందించిన ఈవో పూర్తి వివ రాలను తెలుసుకుని కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే భూములు ఉన్న ప్రాంతంలోని అధికారుల సహాయం తీసుకోవాలని ఆదేశించారు.



# ట్రాన్స్‌జెండర్ల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తామని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ చెప్పారు. ట్రాన్స్‌జెండర్లు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వారి అవసరాలు, అభ్యర్థనలపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గతనెల 7న విజయవాడలో జరిగిన ట్రాన్స్‌జెండర్ల సదస్సులో తెలుసుకున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్న హామీ మేరకు సోమవారం మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్స్ ప్రతినిధులతో ఆమె సమావేశమై, ప్రభుత్వానికి అందించే నివేదికపై చర్చించారు. సమాజంలో ట్రాన్స్‌జెండర్స్ గౌరవప్రదంగా జీవించడం, సమాన అవకాశాలు పొందటంపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకోసం మంత్రి లోకేశ్‌ను కలిసి సమస్యలు, అవసరాలను వివరించే అవకాశాన్ని ట్రాన్స్‌జెండర్స్ ప్రతినిధులకు ఆమె కల్పించారు. ట్రాన్స్‌జెండర్ల ఆవేదనను మంత్రి లోకేశ్ ఓపికగా విని, సానుకూలంగా స్పందించారని శైలజ వివరించారు.

# హజ్‌యాత్రకు బయల్దేరిన మరో 185 మంది



**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** రాష్ట్రానికి చెందిన 185 మంది హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రం–శంషాబాద్ విమానాశ్రయం నుంచి సోమవారం హజ్‌యాత్రకు బయలుదేరారు. శంషాబాద్ సమీపంలోని విడిది కేంద్రం నుంచి విమానాశ్రయానికి బయలుదేరిన వాహనాలను రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్, మైనార్టీశాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, హజ్‌కమిటీ చైర్మన్ హసన్ బాషా, సీఈవో గౌస్ పీర్ జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం మూడు విమానాల్లో మొత్తం 185 మంది హజ్‌యాత్రకు పయనమైనట్లు మంత్రి షరూక్ తెలిపారు.

# ప్రకాశం జిల్లాలో అరుదైన ఘటన.. ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్న రావిచెట్టు



**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** ప్రకాశం జిల్లాలోని ముండ్లమూరు మండలం మారెళ్ల గ్రామంలో వింత ఘటన చోటుచేసుకుంది. సుమారు 15 రోజుల క్రితం గ్రామంలో ఉన్న ఒక పెద్ద రావి చెట్టును గ్రామస్థులు నరికివేసినప్పటికీ, ఆ చెట్టు మొద్దు మళ్లీ పైకి లేచి నిలబడింది. దీనిని చూసిన స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు.బ్రహ్మంగారి హోమం కోసం నరికిన చెట్టు.. గ్రామస్థులు తెలిపిన సమాచారం ప్రకారం.. కొన్నిరోజుల క్రితం ఊర్లో ఉన్న పెద్ద రావి చెట్టును నరికేశారు. కూకటి వేళ్లతో సహా పెకిలించి నేలకూల్చారు. దాని కర్రలను బ్రహ్మంగారి హోమ కార్యక్రమానికి ఉపయోగించారు. కానీ మంగళవారం ఉదయం గ్రామస్థులు గమనించినప్పుడు, నరికేసిన చెట్టు మొదలు మళ్లీ పైకి లేచి నిలబడి ఉంది. ఇది చూసి గ్రామస్థులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే గ్రామస్థులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ప్రజలు దీనిని దేవుడి మహిమగా పేర్కొంటూ చెట్టు వద్ద పూజలు ప్రారంభించారు. దీపాలు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. కొందరు మహిళలు పూనకాలతో ఊగిపోయారు.

గ్రామస్థుల భిన్నాభిప్రాయాలు..

ఈ ఘటనపై గ్రామస్థుల మధ్య భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొందరు ఇది దైవ సంకేతంగా భావిస్తుండగా, మరికొందరు ఇది సహజ ప్రక్రియలో భాగం కావచ్చని చెబుతున్నారు. మొన్న కురిసిన వర్షాల కారణంగా చెట్టు వేర్లు బలపడి ఉండవచ్చని, అందువల్ల మళ్లీ నిలబడి ఉంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మట్టి కదలికల కారణంగా గానీ.. వర్షాల ప్రభావంతో గానీ ఇలా జరిగి ఉండొచ్చని అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ.. ఈ వింత ఘటనను చూడటానికి స్థానికులతో పాటు.. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.





# 15 వరకు వినతులు: డెడికేటెడ్ కమిషన్

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** డెడికేటెడ్ కమిషన్‌కు వినతులు సమర్పించేందుకు గడువును ఈ నెల 15 వరకు పొడిగిస్తున్నట్లు కమిషన్ కార్యదర్శి డి.చంద్రశేఖర్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నెలాఖరు వరకు ఉన్న గడువును పలు బీసీ సంఘాల అభ్యర్థన మేరకు పొడిగించారు. ఆయా సంఘాలు, వ్యక్తులు స్వయంగా కమిషన్ దృష్టికి కాని, ఈ మెయిల్ ద్వారా కాని, విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి పోస్టు ద్వారా కాని వినతి పత్రాలు అందించవచ్చని ప్రకటనలో తెలిపారు. బీసీల కులగణనతో పాటు వారి స్థితిగతుల అధ్యయనానికి ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేయనుంది. కాగా సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సమీక్ష సమావేశాన్ని, బహిరంగ విచారణను నిర్వహించారు. గత ఎన్నికలకు సంబంధించిన సర్పంచ్ స్థానాల వివరాలు, బీసీలకు కేటాయించిన సీట్లు, గెలుపొందిన బీసీ అభ్యర్థులు వంటి వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ విచారణలో స్వీకరించిన వినతులను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

# ఏపీ లాసెట్‌కు 80శాతం హాజరు

**క్రైం కౌంటర్ న్యూస్ మే 05:** తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయజ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఏపీ లాసెట్, పీజీఎల్‌సెట్ ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో 100 పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. తిరుపతిలోని అయాన్ డిజిటల్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏపీ లాసెట్ చైర్ పర్సన్, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ ఆర్.ఉష, లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టి.సీతాకుమారి పరిశీలించారు. పరీక్షలకు 30 వేల మంది దరఖాస్తు చేసుకోగా.. మూడేళ్ల లా కోర్సుకు 78 శాతం, ఐదేళ్ల లా కోర్సుకు 83, ఎల్ఎల్ఎంకు 85.. మొత్తంగా 80 శాతం మంది హాజరయ్యారు.



# సినిమా



## జీవిత కంటే ముందు ఆ హీరోయిన్ నుంచి పెళ్లి ప్రపోజల్

మొన్నటి వరకు హీరోగా మాత్రమే సినిమాలు తీసిన రాజశేఖర్ ఇప్పుడు సహాయక నటుడిగానూ రాణిస్తున్నారు. యంగ్ హీరోల సినిమాల్లోనూ కీలక పాత్రలతో ఆకట్టుకుంటున్నారు. ఆ మధ్యన నితిన్ 'ఎక్స్ ట్రార్డినరి మ్యాన్' మూవీలో కనిపించిన రాజశేఖర్ లేటెస్ట్ గా బైకర్ సినిమాలోనూ ఓ కీలక పాత్ర పోషించారు. శర్వానంద్ తండ్రి సునీల్ నారాయణ్ అలియాస్ బుల్లెట్ సునీల్ పాత్రలో అద్భుతంగా నటించారు. కొన్ని సీన్లలో అయితే తన యాక్టింగ్ తో కన్నీళ్లు తెప్పించారు యాంగ్రీమ్యాన్. సినిమా కూడా సూపర్ హిట్ కావడంతో రాబోయే రోజుల్లో రాజశేఖర్ మరింత బిజీ కావొచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాగా సినిమా ప్రమోషన్లలో భాగంగా పలు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు రాజశేఖర్. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇప్పుడవి నెట్టింట వైరల్ అవుతున్నాయి.కాగా రాజశేఖర్, జీవితలు ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఎన్నో సినిమాల్లో హీరో, హీరోయిన్లు గా నటించిన వీరు ప్రేమికులుగా మారారు. ఆ తర్వాత పెద్దల అంగీకారంతో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. అయితే జీవిత కంటే ముందు శ్రీదేవితో తనకు పెళ్లి ప్రపోజల్ వచ్చిందని రాజశేఖర్ అంగీకరించారు. శ్రీదేవి తండ్రికి, మా నాన్నగారికి మధ్య మంచి స్నేహం ఉండేది. ఆ చొరవతో ఇరువైపులా స్నేహితుల మధ్య పెళ్లి ప్రపోజల్ వచ్చిన మాట నిజమే. మా కులం కూడా ఒకటే. దూరపు బంధువులు అవుతారు. అందుకే శ్రీదేవి ఫ్యామిలీ నుంచి నాకు పెళ్లి ప్రపోజల్ వచ్చింది. అప్పటికీ నేను ఇంకా సినిమాల్లోకి రాలేదు. ఎంఎస్ చదవాలనుకుంటున్నాను. ఇదే విషయాన్ని మా నాన్న వాళ్లకు చెప్పి వారి ప్రపోజల్ని రిజెక్ట్ చేశారు. సినిమాల్లో నటించేవాళ్లను పెళ్లి చేసుకోవడం మా ఇంట్లోవాళ్లకు ఇష్టం లేదు. అందుకే శ్రీదేవితో పెళ్లి ప్రపోజల్ని పక్కన పెట్టారు. అయితే శ్రీదేవి ఇప్పుడు మన మధ్య లేరు. అందుకే ఈ విషయం గురించి మనం మాట్లాడడం సరికాదు. అందుకే ఎక్కడా ఈ విషయం గురించి చెప్పను' అని రాజశేఖర్ చెప్పుకొచ్చారు.



## బొప్పాయి కొనుగోలు చేసే ముందు ఈ విషయాలు గుర్తుపెట్టుకోండి



మార్కెట్లో కనిపించే నారింజ రంగు బొప్పాయిలన్నీ అసలైనవి కావు. సహజంగా పండిన బొప్పాయిలు సాధారణంగా పసుపు, ఆకుపచ్చ రంగుల మిశ్రమంతో ఉంటాయి. రసాయనికంగా పండించిన బొప్పాయిలు అసాధారణంగా అందంగా, మచ్చలు లేకుండా అంతా ఒకే రంగులో కనిపిస్తాయి. ఇవి ఆరోగ్యానికి చాలా హానికరం. చెట్టు మీద పండిన బొప్పాయి తొక్క ఎప్పుడూ పూర్తిగా నునుపుగా లేదా జిడ్డుగా ఉండదు. దానిపై చిన్న నల్లటి మచ్చలు ఉంటాయి. అదే కార్బైడ్లో పండించిన బొప్పాయి ఉపరితలం చాలా నునుపుగా ఉండి, పసుపు రంగులో పండు మొత్తం ఏకరీతిగా కనిపిస్తుంది. మోసపోకుండా ఉండటానికి కొనుగోలు చేసేటప్పుడు తొక్క ఆకృతిని జాగ్రత్తగా గమనించడం చాలా ముఖ్యం.

సహజంగా పండిన బొప్పాయికి దాని స్వంత తియ్యని సువాసన ఉంటుంది. కానీ రసాయనికంగా పండించిన బొప్పాయిలకు సహజమైన సువాసన ఉండదు. కొన్నిసార్లు చేదు వాసన కూడా వస్తుంది. అందువల్ల కొనే ముందు కాయ వాసన చూడటం మరో ముఖ్యమైన చిట్కా. బొప్పాయి మెత్తదనాన్ని దాని గుంటలున్న వైపున తేలికగా నొక్కి పరీక్షించండి. సహజంగా పండిన బొప్పాయిలు అన్ని వైపులా సమానంగా మెత్తగా, రసవంతంగా ఉంటాయి. కృత్రిమంగా పండించిన బొప్పాయిలు బయట పసుపు రంగులో కనిపించినప్పటికీ, లోపల చాలా గట్టిగా ఉంటాయి. అందువల్ల అవి తినడానికి అంత రుచిగా ఉండవు. సహజంగా పండిన పండు కాండం, దాని చుట్టూ ఉండే భాగం సాధారణంగా కొద్దిగా మెత్తగా, ముడతలు పడి ఉంటుంది. ఒకవేళ బొప్పాయి పండు ప్రకాశవంతమైన రంగులో ఉండి, దాని కాండం చాలా గట్టిగా ఉంటే అది రసాయన ప్రక్రియ ద్వారా పండించబడిందని అర్థం చేసుకోవాలి. కృత్రిమంగా పండించిన పండు కాండం భాగం ఎప్పుడూ సహజంగా ఎండిపోదు.

బొప్పాయిని కోసినప్పుడు దాని గింజలు నల్లగా ఉండి, జెల్లీ లాంటి పొరతో కప్పబడి ఉంటే అది సహజమైన పండుగా గుర్తించాలి. కార్బైడ్తో పండించిన బొప్పాయి గింజలు సాధారణంగా తెల్లగా లేదా అపరిపక్వంగా ఉంటాయి. ఎందుకంటే ఆ పండు సహజంగా పోషణ పొందడానికి సమయం ఉండదు. గింజల రంగును చూడగానే అసలైనదానికి, నకిలీదానికి మధ్య తేడా స్పష్టంగా తెలుసుకోవచ్చు. సహజంగా పండిన బొప్పాయి లోపలి భాగం ముదురు నారింజ రంగులో ఉండి, ప్రతి భాగం మెత్తగా, రసవంతంగా ఉంటుంది. కానీ రసాయనాలతో శుద్ధి చేసిన బొప్పాయిని కోసినప్పుడు, దాని లోపలి భాగం పాలిపోయి చాలా గట్టిగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ రకమైన బొప్పాయి రుచి చప్పగా, ఏమాత్రం తీపి లేకుండా ఉంటుంది. ప్రకారం కార్బైడ్ నుండి విడుదలయ్యే వాయువు శరీరానికి చాలా ప్రమాదం. ఇది జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. కాబట్టి, కేవలం దాని రూపాన్ని చూసి కాకుండా దాని నాణ్యతను బట్టి సరైన బొప్పాయిని కొనుగోలు చేయండి. తద్వారా మీ కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచుకోండి.

## ఈ సమ్మర్లో కూల్గా ఉండాలంటే ఇవే బెస్ట్ డ్రింక్స్!



దేశంలో రోజుకు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో పిల్లలు, పెద్దలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే, ఎంత వేడి ఉన్నా, శరీర ఉష్ణాన్ని నియంత్రించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ముఖ్యంగా వేసవి సెలవులలో పిల్లలు మధ్యాహ్న వేళల్లో విశ్రాంతి లేకుండా ఆటల్లో మునిగిపోతుంటారు కాబట్టి, వారిని సరైన విధంగా ప్రోత్సహించి కొంత విశ్రాంతి తీసుకునేలా చూడాలి. వేసవిలో అధిక స్వేదం కారణంగా శరీరంలోని నీటి శాతం వేగంగా తగ్గిపోతుంది. నీరు దాహం తీర్చడానికి అత్యవసరమైనదైనా, తీవ్రమైన ఎండల్లో శరీరాన్ని చల్లగా ఉంచేందుకు సహజమైన, ఆరోగ్యకరమైన పానీయాలు ఎంతో ఉపయుక్తం. వేడి గాలులు, ఉక్కపోత మధ్యాహ్నాలను తట్టుకోవడానికి ఇలాంటి పానీయాలు చల్లదనాన్ని, ఆహ్లాదాన్ని ఇస్తాయి.దక్షిణ భారతదేశంలో వేసవికాలంలో లభించే అనేక సహజ ఆహారాలు, పానీయాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. మన అమ్మమ్మలు, తల్లులు అనాదిగా ఉపయోగిస్తున్న ఈ సంప్రదాయ పానీయాలు శరీరాన్ని చల్లబరచడంలో సహాయపడతాయి. ఇంట్లో సులభంగా తయారు చేసుకునే కొన్ని పానీయాలు, అలాగే ప్రయాణంలో కూడా ఉపయోగపడే కొన్ని పానీయాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

కొబ్బరి నీరు: తాజా కొబ్బరి నీరు వేసవికి అత్యుత్తమ సహజ పానీయం. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు శరీర ఉష్ణాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. సాదాగా లేదా కొద్దిగా పండ్ల రసాలతో కలిపి తీసుకుంటే మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది.

చెరుకు రసం: శతాబ్దాలుగా సహజ ఆరోగ్య పానీయంగా చెరుకు రసం వినియోగంలో ఉంది. ఖనిజాలు, పోషకాలు సమృద్ధిగా ఉండే ఇది శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. నిమ్మరసం లేదా అల్లం కలిపితే రుచి మరింత మెరుగవుతుంది.

పుచ్చకాయ రసం: వేసవిలో అత్యంత ప్రజాదరణ పొందిన పండు పుచ్చకాయ. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేసి తక్షణ తేజస్సును ఇస్తుంది. దాహాన్ని తగ్గించడంలో ఇది చాలా ప్రభావవంతం.

నిమ్మరసం: చల్లని నీటిలో నిమ్మరసం, కొద్దిగా ఉప్పు, పంచదార కలిపి తీసుకుంటే ఇది ఉత్తమ వేసవి పానీయం అవుతుంది. ఇది శరీరాన్ని చల్లగా ఉంచడమే కాకుండా ఉత్సాహాన్ని కూడా పెంచుతుంది.

జల్జీరా: వేయించిన జీలకర్ర పొడి, నల్ల ఉప్పు కలిపి తయారు చేసే ఈ పానీయం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వేసవిలో అలసట తగ్గించడానికి ఇది మంచి ఎంపిక.

కాంజి: నల్ల క్యారెట్ లేదా బీట్రూట్తో తయారు చేసే ఈ సంప్రదాయ పానీయం ప్రోబయోటిక్ గుణాలతో ప్రసిద్ధి. ఇది జీర్ణ ఆరోగ్యానికి చాలా మంచిది.

జిగర్తాండ: కొన్ని ప్రాంతాల్లో ప్రసిద్ధమైన ఈ తీపి పానీయం పాలు, ఐస్క్రీమ్, ఫలూదాతో తయారవుతుంది. వేసవిలో తీపి కోరికను తీర్చే ప్రత్యేక పానీయం ఇది.

నన్నారి షర్బత్: నన్నారి వేర్లతో తయారయ్యే ఈ సిరప్ శరీరాన్ని చల్లబరచడంలో చాలా ప్రభావవంతం. ఐస్తో కలిపి తీసుకుంటే మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది.

మజ్జిగ: పెరుగుతో తయారయ్యే మజ్జిగ జీర్ణక్రియకు అత్యంత మంచిది. జీలకర్ర, అల్లం లేదా మిరపకాయలతో కలిపి తీసుకుంటే రుచి, ఆరోగ్యం రెండూ లభిస్తాయి.

రాగి మజ్జిగ: రాగిపిండి కలిపిన మజ్జిగ పోషక విలువలు అధికంగా ఉండే ఆరోగ్యకరమైన పానీయం. ఇది వేసవిలో శక్తిని అందిస్తుంది.

లస్సీ: తీపి లేదా మామిడి రుచిలో లభించే లస్సీ వేసవిలో ఎంతో ఇష్టపడే పానీయం. ఇది శరీరాన్ని చల్లబరచడంలో సహాయపడుతుంది.

థిక్ షేక్: పూర్తిగా పాలు ఆధారంగా తయారయ్యే థిక్ షేక్ ఈ వేసవిలో శక్తినిచ్చే, రుచికరమైన పానీయం. స్నాక్స్తో కలిపి తీసుకుంటే మరింత తృప్తికరంగా ఉంటుంది.

ఇలా వేసవిలో సహజమైన, సంప్రదాయ పానీయాలను ఉపయోగించడం ద్వారా శరీరాన్ని చల్లగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

## నువ్వు అసలు ప్రొఫెషనల్ క్రికెటర్వేనా?..



ఐపీఎల్ 2026 సీజన్లో ముంబై ఇండియన్స్ స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ప్రదర్శన అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఒకప్పుడు తన బౌలింగ్తో బ్యాటర్లను వణికించిన బుమ్రా, ఈ సీజన్లో మాత్రం పదును పోయిన కత్తిలా కనిపిస్తున్నాడు. లక్నో సూపర్ జెయింట్తో జరిగిన తాజా మ్యాచ్లో బుమ్రా వేసిన నో బాల్స్ చూసి క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లైవ్ కామెంట్రీలోనే బుమ్రాపై తన కోపాన్ని వెళ్లగక్కారు. లక్నో ఇన్నింగ్స్ 14వ ఓవర్లో బుమ్రా వరుసగా రెండు నో-బాల్స్ వేయడం గవాస్కర్ను తీవ్ర అసహనానికి గురిచేసింది. "మళ్ళీ మళ్ళీ నాకు చెప్పకండి.. బుమ్రా నో-బాల్ వేశాడంటే నేను నమ్మలేకపోతున్నాను. ఇది అస్సలు ఆమోదయోగ్యం కాదు. నువ్వు ఒక ప్రొఫెషనల్ క్రికెటర్వి, ఇలాంటి తప్పులు చేయడం ఏంటి? వైడ్లు వేస్తే అర్థం చేసుకోవచ్చు కానీ, నో-బాల్స్ వేయడం క్షమించరాని నేరం" అంటూ గవాస్కర్ మైక్ ముందే విరుచుకుపడ్డారు.లక్నో బ్యాటర్ హిమ్మత్ సింగ్ 14వ ఓవర్లో బుమ్రా బౌలింగ్లో అవుట్ అయ్యాడు. కానీ రీప్లేలో అది నో-బాల్ అని తేలడంతో హిమ్మత్ సింగ్ బతికిపోయాడు. ఆ తర్వాత రెచ్చిపోయిన హిమ్మత్, 40 పరుగులు చేసి లక్నో స్కోరును 220 దాటించాడు. ఈ తప్పిదం మ్యాచ్పై ఎంతటి ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు. బుమ్రా నో-బాల్స్ వేస్తున్నప్పుడు కెమెరాలు ముంబై కోచ్ మహేల జయవర్ధనే, బౌలింగ్ కోచ్ లసిత్ మలింగ వైపు మళ్లగా, వారి ముఖాల్లో నిరాశ స్పష్టంగా కనిపించింది. బౌలింగ్ కోచ్ గారూ.. ఇది చాలా పెద్ద తప్పు అంటూ మలింగను ఉద్దేశించి గవాస్కర్ వ్యాఖ్యానించారు.

బుమ్రాకు ఈ 2026 ఐపీఎల్ సీజన్ ఒక పీడకలలా మారింది. ఇప్పటివరకు 10 మ్యాచ్లు ఆడిన ఆయన కేవలం 3 వికెట్లు మాత్రమే తీశాడు. లక్నోతో జరిగిన మ్యాచ్లో 4 ఓవర్లు వేసి 45 పరుగులు సమర్పించుకుని ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. గత రెండు నెలల క్రితం వరకు అద్భుత ఫామ్లో ఉన్న బుమ్రా, ఈ సీజన్లో ఇన్ని నో-బాల్స్ (మొత్తం 8) వేయడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. ముంబై ఇండియన్స్ సీజన్ ఎలా సాగుతుందో బుమ్రా బౌలింగ్ చూస్తే అర్థమైపోతోందని మాజీ క్రికెటర్ దీప్ దాస్గుప్తా కూడా ఎద్దేవా చేశారు.టాస్ గెలిచిన ముంబై మొదట బౌలింగ్ ఎంచుకోగా, లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోరు సాధించింది. నికోలస్ పూరన్ (63), మిచెల్ మార్ష్ (44) మెరుపులు మెరిపించారు. అయితే, ముంబై బ్యాటర్లు ఏమాత్రం తగ్గకుండా ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించారు. రోహిత్ శర్మ (84), ర్యాన్ రికెల్టన్ (83) అద్భుత ఇన్నింగ్స్ ఆడటంతో ముంబై మరో 10 బంతులు మిగిలి ఉండగానే 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ గెలిచినప్పటికీ, బుమ్రా ఫామ్ మాత్రం ముంబై యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:1-94 nekunampuram,pokur,Prakasam,andhrapradesh 523113Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2843. Ph:9849707349 . email:kvp6858@gmail.com.